# నాకు నచ్చిన పద్యం

కాశీనాథుని రాధ



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 137




# ప్రారంభం

**ఒక పుస్తకం తెరిచి ఒక మంచి పద్యమో,కథో,కవితో చదివి ఆనందపడేవాళ్ళు కొంతమందైతే,** అది కలిగించిన స్పందన ఎలాంటిదో, ఎందుకో, ఇతరులతో పంచుకోవాలని తాపత్రయపడే వాళ్ళు మరి కొందరు. నేను మాత్రం ఖండితంగా రెండో కోవకి చెందిన మనిషిని. నాకు నచ్చిన పద్యాలు కోకొల్లలు. ‘‘అన్నెందుకు గాని అందాకటికి ఒకటి చెప్పు చాలు’’ అని మీరంటారని నాకు తెలుసు. అందుకే తిన్నగా అసలు విషయాని కొస్తాను.

ఇది ఆదికవి నన్నయగారి మహాభారతంలోనిది. నన్నయగారు ఆదికవి కాదేమోనని కొంతమంది అంటున్నారు కదా! అన్న కొశ్చన్ మార్కు తలలో మెరిసిన వాళ్ళకి నాజవాబు ... ‘‘అలవాటు చొప్పున అన్నాను. మహాకవిగా అగ్రాసనం పుచ్చుకోగల అర్హతని తానే సంపాదించుకున్న ఆయనకి మనం ఇవ్వాల్సిన, ఇవ్వగలిగిన బిరుదులు ఏవీ లేవు ‘‘ అని. కనుక అదలా ఉంచి అసలు కథకొద్దాం. మనలో చాలమంది తమ జ్ఞాపకాల మడతలని విప్పిచూస్తే ఈ పద్యం పువ్వుగుర్తుతో సహా కనబడొచ్చు.

ఉ. కాదన కిట్టి పాటి యపకారముఁ దక్షకుడేక విప్ర సం
బోధనఁ జేసి చేసే నృపపుంగవ నీవు ననేక భూసురా
పాదితసర్పయాగమున భస్మము సేయుము తక్షకాది కా
కోదరసంహతిన్ హుతవహోగ్రసమగ్ర శిఖాచయంబులన్

- మహాభారతము, ఆదిపర్వము,ప్రధమాశ్వాసము,పద్యం 124
- ద్వితీయాశ్వాసము, పద్యం 204

ఇందులో పొరపాటు ఏవీ లేదు. అవును ఒక పద్యమే, ఆదిపర్వంలోనే రెండుసార్లు వస్తుంది. దీన్ని గురించి తరువాత మాటాడుకుందాం.

ప్రసన్నకథాకలితార్థయుక్తితో నన్నయగారు చెప్పిన అసంఖ్యాకమైన కథల్లో ఒకటైన ఉదంకోపాఖ్యానం లోనిది ఈ పద్యం. ఉందంకుడనే ఒక శిష్యుడు విద్యాభ్యాసం పూర్తి చేసి, తన గురుపత్నికి, పౌష్యుడనే మహారాజు భార్య వద్ద నుంచి కుండలాలను తేవడానికి

వెళతాడు. ఉదంకుడు కోరిన కుండలాలని చేత పెడుతూ "మాయావి అయిన తక్షకుడనే నాగుడు ఎప్పుడూ వీటిని దొంగిలించాలనే ప్రయత్నంలో ఉంటాడు జాగ్రత్త సుమీ!" అని చెప్పి పంపుతుంది పౌష్యుడి భార్య. అయినా ఈ వెర్రిబాగుల బ్రాహ్మణుడు వాటిని నది ఒడ్డున పెట్టి, ఆచమనం చేసుకోటానికి పోతాడు. కాచుకుని కూర్చున్న తక్షకుడు వాటిని దొంగిలించాడు. ఉదంకుడు వాడి వెంటపడి, పాతాళానికి వెళ్ళి, అష్టకష్టాలు పడి, వాటిని తిరిగి సంపాదించి, ఇంద్ర సఖుడైన పర్జన్యుని కృపవల్ల గురుపత్ని వ్రతం ముగిసే సమయానికి ఆ కుండలాల్ని అందజేస్తాడు.

గురువుగారి దగ్గర సెలవు తీసుకుని, కొంతకాలం తపస్సు చేసిన తరవాత కూడా, ఉదంకుడు, తక్షకుడు తనకు కలిగించిన కష్టాన్ని మర్చిపోక, వాడికి తగిన శాస్తి చెయ్యాలని సంకల్పించుకుని, జనమేజేయ మహారాజు దగ్గరకు వెళతాడు.

ముందుగా తనకు నిష్కారణంగా తక్షకుడు అపకారం చేశాడు అని విన్నవించుకున్నాడు. అటు తరువాత, లోకోన్నతుడు,పుణ్యాత్ముడు, ప్రజానురంజకుడు అయిన, నీ తండ్రి పరీక్షిత్తుడిని, తన విషాగ్నిచేత నాశనం చేసిన దుర్మార్గుడు ఈ తక్షకుడు. – అంటూ ఇది నా ఒక్కడి సమస్యేననుకునేవు సుమీ! ఇది నీ సమస్యకూడాను – అన్నసగంతి వత్తి చెప్పి, నువ్వు వాడిని, వాడి వంశాన్ని సర్పయాగం చేసి నాశనం చెయ్యి - అని ప్రేరేపించిన సందర్భంలో అన్న మాటలివి. ఉదంకుడి మాటలు విన్న జనమేజేయుడు, తన మంత్రులని తండ్రి మరణవృత్తాంతం అడగడం, దానికి వాళ్ళు పరీక్షిత్తుడి కథ చెప్పడం జరుగుతుంది. ఈ కథ మనకు తెలిసిందేకదా. వేటలో అలిసిన పరీక్షిత్తుడు తన ప్రశ్నకు జవాబు చెప్పక, తపోదీక్షలో మౌనంగా ఉన్న శమీకుడనే ముని మెడలో చచ్చిన పాముని వేసి వెడతాడు. ఇది విని, ఆ ముని కొడుకైన శృంగి అన్న వాడు, ముందు వెనకలు చూసుకోకుండా "ఈ అపకారం చేసిన రాజు ఏడు రోజుల్లో తక్షకుడనే సర్పం వల్ల మరణిస్తాడు" అని శాపం ఇచ్చాడు.

ఈ పద్యాన్ని రెండు భాగాలు గాచేసి ముందు రెండో భాగాన్ని చూద్దాం.

"నృపపుంగవ! నీవు ననేక భూసురా

పాదితసర్పయాగమున భస్మము సేయుము తక్షకాది కా

కోదరసంహతిన్ హుతవహోగ్ర సమగ్ర శిఖా చయంబులన్" - అన్నది పద్యంలో రెండో భాగం. నృపపుంగవ! నీవు, అనేక భూసురాపాదిత సర్పయాగమున హుతవహోగ్ర సమగ్ర శిఖా చయంబులన్ తక్షకాది కాకోదరసంహతిన్ భస్మము సేయుము. – అన్నది అన్వయం.

ఇందులో రాజుగారి సంబోధన "నృపపుంగవ". అంటే రాజుల్లో శ్రేష్టుడా! అని. కనుక నేను చెప్పబోయేది చెయ్యగల సమర్థత నీకుంది అన్న సూచన. ఎందుకంటే, రాజుగారు తలుచుకుంటే దెబ్బలకేం కొదువ అన్నట్టు, బోలెడంత మంది బ్రాహ్మణులని కూడగట్టుకుని, సర్పయాగాన్ని నీలాంటి వాడే చెయ్యగలడు. ఇక నాశనం చెయ్యవలసినది తక్షకుడినే కాదు, వాడి సంతతిని కూడా. అవి భయంకరమైన సర్పాలు. వాటిని అందుకుని బూడిద చెయ్యడానికి మామూలు మంటలు చాలవు. గొప్ప హోతలు హోమం చేస్తుండగా పైకిలేచే ఒక మంట కాదు, బాగా వ్యాపించి, భయంకరంగా పైకి లేచే జ్వాలా సమూహాలు కావాలి మరి.

"హుతవహోగ్రసమగ్రశిఖా చయంబులన్" అన్న సమాసం - ఉదంకుడు "ఇంత ఎత్తు, ఇంత వైశాల్యంతో వ్యాపించే అగ్నిజ్వాలలు" అని చేతులు చాపి చూపిస్తున్నాడా అన్నట్టు ధ్వనిస్తుంది. ఇదంతా బాగానే ఉంది. దీన్ని ఏ కవైనా రాస్తాడు.

మొదటి భాగం అయిన "కాదనక ఇట్టి పాటి అపకారము తక్షకుడు ఏక విప్ర సంబోధన చేసి చేసె" అన్నదాంట్లోనే ఉంది నన్నయగారి చాతుర్యమంతా. ఇది గట్టిగా ఒకటిన్నర పాదం కూడా లేదు. కాని వంద మాటలతో చెప్పవలసిన భావాన్ని, విషయాన్ని ఈ నాలుగు ముక్కల్లో ఇమిడ్చారు నన్నయ.

ఇక్కడ " నీతండ్రిని చంపిన తక్షకుడు దుష్టుడు, దుర్మార్గుడు, అహంకారి - అన్నది నేను క్షణంలో నీకు నిరూపిస్తాను" అనే న్యాయవాది వాదనలాగ ఉన్నాయి ఉదంకుడి మాటలు. పైగా అతడు ముక్కుమూసుకు తపస్సు చేసుకునే ముని. క్లుప్తంగాను, సూటిగాను మాట్లాడటమే అతని సహజలక్షణం. అందుకే సమయోచితంగాను, పాత్రోచితంగాను, నన్నయ కొలిచినట్టు మాటలు వాడటం జరిగింది. తక్షకుడు చేసిన "అపకారము" "ఇట్టి పాటి" ది. అంటే చిన్నది అని కాదు అర్థం. " ప్రజానురంజకుడైన రాజుని హతమార్చడం" అన్న ఇల్లాంటి అపకారం ఘోరమైనది , ఇంతకు ముందెప్పుడూ విననిది.

"ఏక విప్రసంబోధనన్" - ఒక బ్రాహ్మణుడు తనని పిలవగానే లేదా ఆదేశించగానే అని అర్థం. ఒక్క బ్రాహ్మడు ఒక మాట అనగానే, అంటే ఓ పదిమంది చేరి, విచారించి, తీర్మానం చేయలేదు. పోనీ తానైనా ఆలోచించాడా అంటే అదీ లేదు. అలాంటిది ఏవీ లేకుండానే తనే నిర్ణయం చేసేశాడు. "కాదనక" - కాదు, కూడదు అనకుండా సిద్ధం అయ్యాడు ఈ ఘోరం చెయ్యడానికి.

ఇక పైన చెప్పిన రెండవ భాగం రెండున్నర పాదాలలో – "మరి ఇటువంటి వాడిని శిక్షించకుండా వదిలేస్తావా? గట్టి శిక్షే వేయాలి ఎందుకంటే నువ్వు సమర్థుడివైన రాజువు కాబట్టి " అంటూ ఎలాంటి శిక్షని వెయ్యాలో ఉపదేశిస్తాడు ఉదంకుడు.

ఇకపోతే ఈ పద్యం మంత్రులు జనమేజేయుడికి, పరీక్షిత్తుడి కథ చెప్పడం అయ్యాక మరో సారి వస్తుంది. ఇక్కడ ఉదంకుడే ఈ మాటలు అన్నట్టు స్పష్టంగా చెప్పకుండా వదిలేసారు నన్నయ. అయితే నడుంబిగించి, పనికట్టుకుని వచ్చిన ఉదంకుడు, వచ్చిన పని కాకుండా ఎలా వెళతాడు? అందుకని కథ ముగిసే దాకా కూర్చుని, అతడే మళ్ళీ అని ఉంటాడు. ఇంత భారతం రాసిన నన్నయ మరో పద్యం రాయడానికి బద్ధకించి ఉండరు.

అదే పద్యాన్నిమరోసారి వాడుకోడానికి కారణం: "ఇంతకంటే ఇంకేం చెబుతాము" అన్నది ఆయన ఆలోచనే కాదు. లోక సహజమైనది కూడా. లోకంలో సాధారణంగా బాగా నొక్కి చెప్పిన విషయాన్ని గురించి మరింత చెప్పవలసింది లేనప్పుడు "మరి ఇంతకంటే నేనింక ఏంచెప్పగలను" అని వదిలేస్తారు. నన్నయ కూడా సరిగ్గా ఆ పనే చేశారు.

ఉదంకుడు జనమేజేయుడికి చెప్పవలసినది అంతా చెప్పేడు. ఇంతకన్నా మరేం చెప్పనయ్యా ! ఇంతకుముందు నేను చెప్పినదానికి మరోమాట చేర్చడానికి గాని, మార్చడానికి గాని ఏవుంది? అంటూ మళ్ళీ అవే మాటలని అంటాడు - అన్నట్టు వదిలేసారు నన్నయ. ఇంతటి కథాకథనసమర్థులు కాబట్టే "సారమతిన్ కవీంద్రులు ప్రసన్నకథాకలితార్థయుక్తి లోనారసి మేలునా " అని గుండె మీద చేయి వేసుకునిమరీ చెప్పుకోగలిగారు నన్నయ.

మ. నరచాపప్రవిముక్తదారుణబృహన్నారాచధారల్ భయం
కరదైతేయనికాయకాయములపైఁగప్పెన్ దిశల్ నిండ బం
ధురధాత్రీధరతుంగశృంగతటసందోహంబుపైఁ గప్పుదు
ర్ధర ధారాధర ముక్త సంతత పయోధారాళిం బోలుచున్

- ఆదిపర్వం, ద్వితీయాశ్వాసం, పద్యం. 23

మ. పతదుర్వీధరధాతునిర్ఝరజలాభంబై మహాదేహని
ర్గత సాంద్రారుణపూర మొక్కమొగి నొల్కం ద్రెస్సి నారాయణో
న్నతదోర్దండవిముక్తచక్రనిహతిన్ నాకద్విషన్మస్తక
ప్రతతుల్ ఘోరరణంబునన్ బడియె భూభాగంబు గంపింపన్

- ఆదిపర్వం, ద్వితీయాశ్వాసం, పద్యం. 24

ఈ రెండు పద్యాలు నన్నయగారి భారతంలో ఆదిపర్వం ద్వితీయాశ్వాసం లోనివి. నరనారాయణులు రాక్షసులతో చేసిన యుద్ధవర్ణన ఇది.

నాకు నచ్చిన ''పద్యం'' అంటూ ''పద్యాల'' గురించి వ్రాస్తున్నావెందుకు ? అంటారా... కొన్ని సందర్భాల్లో పద్యాలు కొన్ని జంటగా వస్తుంటాయి. ఇక్కడ నరుడి గురించి చెప్పి, నారాయణుడిని, నారాయణుడి గురించి చెప్పి, నరుడిని వదిలెయ్యడం సమంజసం కాదుకదా వాళ్ళిద్దరు ఒక జంట. అందుకని రెండు పద్యాలు.

సంగతి సందర్భం లేకుండా ఏవిషయాన్ని చెప్పినా బాగుండదు కనుక ఇక్కడ కాస్త నేపథ్యం చెప్పుకుందాం. '' ఏయది హృద్యమపూర్వం బేయది ...ఎద్దాని వినిన ఎరుక సమగ్రంబై యుండు'' అలాంటి కథ మాకు చెప్పు అంటూ శౌనకాది మహామునులు కధాకధనదక్షుడైన సూతుడిని అడగ్గా అతడు చెప్పడం ప్రారంభిస్తాడు. అలా మొదలైన భారతకథ యొక్క ఉపోద్ఘాతం అంతా కథలో కథగా గొలుసులా అల్లుకుని, ఆదిపర్వం చతుర్దాశ్వాసంలో శకుంతలా దుష్యంతుల వృత్తాంతం వరకు సాగింది. అక్కడి నుంచి కురువంశం యొక్క అనుక్రమణి చెప్పబడుతుంది.

జనమేజయుడు చేసిన సర్పయాగంలో పాములు నశించటానికి కారణం ఏవిటి? కన్నతల్లి అయిన కద్రువ కొడుకులకు శాపం ఎలా ఇచ్చింది? అని శౌనకాదులు ప్రశ్నించగా గరుత్మంతుని కథ మొదలు పెడతాడు సూతుడు. ఈ కథలో గరుడుని తల్లి వినత, తన సవతి అయిన కద్రువకు దాసి కావడానికి కారణం - ఉచ్చై శ్రవం అనే గుఱ్ఱాన్ని గుఱించిన పందెం. కనుక ఆ అశ్వం క్షీరసాగరంలో పుట్టిందని చెప్పటానికి మళ్ళీ ఆకథ. క్షీరసాగరమథన కథ అందరకీ తెలిసిందే. పని ప్రారంభించడానికి ముందు చేసుకున్న ఒప్పందం ప్రకారం పాలసముద్రంలో పుట్టిన అమృతాన్ని దేవతలు, రాక్షసులు పంచు కోవాలి. కాని దేవతలు, విష్ణువు సహాయంతో, అమృతాన్ని రాక్షసులకి అందకుండా చేస్తారు.

అమృతం తమకి దక్కకుండా మోసం చేసిన దేవతల మీదికి రాక్షసులు అంతకాకారులై (యముడి వంటి రూపంతో అంటే మృత్యుదేవతల్లా) యద్ధానికి వెళతారు. అమృతపానం వల్ల చావులేక పోయినా, చావుదెబ్బలు తిని అల్లాడిపోతారు దేవతలు. అప్పుడు "తమ దారుణబాణప్రయోగంచేత దేవతాసమూహాన్ని కప్పివేసిన ఆ రాక్షసులని", కోదండచక్రోద్యతభుజులు(విల్లుని ధరించి నరుడు,చక్రాన్ని ధరించి నారాయణుడు ఉన్నతమైన భుజాలతో),మహాదారుణులు(భయంకరమైన ఆకృతి గలవారు), వీరలక్ష్మీరమణులు(వీరలక్ష్మిచే వరించబడ్డవారు) అయిన నరనారాయణులు, కోపంతో వారింప శక్యంగాని పెనుగాలిలాగ, ఎదుర్కొన్నారట.

యుద్ధం "సీను" అనగానే మనకి పౌరాణిక చిత్రాలు గుర్తుకొస్తాయి. వీటిలో వీరుడు, ప్రతివీరుడు ఆయుధాలని ప్రయోగిస్తుండగా అవి, వాళ్ళిద్దరి మధ్య ఉన్న ఇరవై అడుగుల దూరాన్ని విస్మరించి, విసుగు,విరామం లేకుండా, బోలెడంత దూరం ప్రయాణంచేసి మరీ వస్తాయి ప్రయోగించబడిన వాడిమీదకి. లేకపోతే ఒక దాన్ని ఒకటి ఢీకొని కింద పడతాయి.

ఈ సన్నివేశాన్ని నిగ్రహానికి మారుపేరైన నన్నయగారు ఎలా నిర్వహించారో చూద్దాం. . ఇక్కడ నరనారాయణులు చేయవలసినది దుష్టశిక్షణ, శిష్టరక్షణ. ఇది ఎంతో ఖరాఖండిగాను(నిక్కచ్చిగాను), ఉద్దండతతోను సాధించ వలసిన కార్యం. అందువల్ల ఇక్కడ కాలయాపన లేకుండా, కార్యసాధన జరిగినట్టు చెప్పడం జరిగింది. అంతేకాక మారుతతుల్యవేగులైన ఆ నరనారాయణులు ధరించే ఆయుధాలు విల్లు,చక్రము. అందుకే వాళ్ళు ఎలాంటి ఆయుధాలు ఎన్నెన్ని ప్రయోగించి ఆ రాక్షసులని ఎదుర్కొన్నారు. – అని వర్ణించకుండా తిన్నగా వారి " ఉద్ధతి, కౌశల్యం దేనిలో కనబడుతుందో " ఆ విషయంలోకి దిగుతారు నన్నయ.

మొదటి పద్యంలో నరుడి బాణప్రయోగమూ, దాని ఫలితమూ చెప్పబడింది. ఈ విషయాన్ని చక్కని ఉపమాలంకారంతో వర్ణించడం జరిగింది.

"నరచాప ప్రవిముక్త దారుణ బృహన్నారాచధారల్" అంటే నరుని విల్లునుండి ఎడతెరపి లేకుండా,ధారాపాతంగా వెలువడిన భయంకరమైన బాణాలు. "దిశల్ నిండ" అంటే దిక్కులన్నీ నిండిపోయి(అంటే అన్నివైపులనుండి వచ్చి). "భయంకర, దైతేయ, నికాయ, కాయములపై" మహాభయంకరులైన ఆ రాక్షస సమూహాల శరీరాలను. "కప్పెన్" ముంచివేశాయి. ఇలా జరగడాన్ని ..

“బంధుర ధాత్రీధర తుంగ శృంగ తట సందోహంబు పై కప్పు “- గుంపులుగా ఉన్న, అందమైన పర్వత శిఖరాల అంచుల మీద ఆవరించుకుని ఉన్న “దుర్ధర ధరాధర ముక్త సంతత పయోధారావళిన్ పోలుచున్ “ - భరింప శక్యం కాని దట్టమైన మేఘాల గుంపు నుండి ఎడతెరపి లేకుండా జారిపడుతున్న నీటి (వర్ష) ధారలతో పోల్చారు నన్నయ.

పోలిక ఎప్పుడూ సమ ఉజ్జీలకే చెబుతారు. ఇక్కడ భయంకరాకారాలు గల రాక్షసులని కమ్మివేసే బాణాలను ఉన్నతమైన పర్వత శిఖరాలను కప్పివేసిన మేఘసముదాయాల నుంచి జారే ఎడతెగని వర్షధారలతో పోల్చడం ఎంతో ఉదాత్తంగా ఉంది.

ఇక రెండవ పద్యం నారాణుని చక్ర ప్రయోగానికి ఫలితాన్ని వర్ణించేది.

“నారాయణోన్నతదోర్దండవిముక్తచక్రనిహతిన్” అంటే నారాయణుని గొప్ప దండాల వంటి భుజాల నుండి వెలువడిన(ప్రయోగించ బడిన) చక్రం యొక్క దెబ్బ చేత. ఇక్కడ చక్రానిది కాదు గొప్పతనం దాన్ని ప్రయోగించిన నారాయణుని భుజబలం. ఈ కార్యం వల్ల జరిగిందేమిటి?

నాక ద్విషత్(స్వర్గానికి శత్రువులైన రాక్షసుల) మస్తక ప్రతతుల్ (బోలెడు తలలు/తలల సమూహాలు) మహాదేహ (పెద్ద శరీరాల నుంచి), సాంద్ర అరుణ పూరము( చిక్కటి ఎర్రని రక్తప్రవాహం), ఒక్క మొగిన్ ఒల్కన్(ఒక్కసారిగా ఒలికి పోగా) త్రెస్సి(తెగిపోయి) భూభాగంబు కంపింపగన్ (భూమి ఆదరిపోయేటట్టు) ఘోర రణంబునన్(భయంకరమైన యుద్ధంలో) పడియె.

మొదటి పాదంలో ఉన్న “పతదుర్వీధరధాతునిర్ఝరజలాభంబై” అన్న సమాసంలో “ఆభ” అంటే సమానం, కాంతి అని రెండర్థాలు. వీటిలో సమానం అన్న అర్థం తీసుకున్నట్టయితే, తలలు తెగిన రాక్షసుల శరీరాల నుండి ఉబికి వస్తున్న రక్తపుధారాలు ఈ విధంగా ఉన్నాయంటూ పోలిక చెప్పబడింది.

పతత్ (పడుతున్న/జారుతున్న) ఉర్వీధర (పర్వతం యొక్క ) ధాతు నిర్ఝర జల (ధాతువులతో కలిసి ఎర్రగాఉన్న సెలయేటి నీటితో) ఆభ (సమానమై) – కొండల మీద ఉండే గైరికాది ధాతువుల వల్ల దానిమించి దూకే సెలయేళ్ళ లోని నీరు ఎర్రగా ఉంటుంది. కనుక తలలు తెగి కింద పడుతున్న పర్వతాకారులైన రాక్షసుల శరీరాలనుండి పెల్లుబికి వస్తున్న రక్తపు ధారాలను కొండలపైనుంచి జారే ఎర్రగా ప్రకాశిస్తున్న సెలయేళ్ళ నీటితో పోల్చడం అన్నది - అతికినట్టు ఒప్పిన ఉపమ.

ఈ పద్యాల్లో మరోవిశేష మేమిటంటే రెండు మత్తేభవృత్తాలు. భయంకరులై విజృంభించిన రాక్షసులని ఢీకొని తొక్కి వెయ్యడం అన్నది మదించిన ఏనుగులవంటి నరనారాయణులకే చెల్లుతుంది. మరి ఇటువంటి వర్ణచిత్రాలని సృష్టించడం నానారుచిరార్థ సూక్తినిధియైన నన్నయభట్టుకే చెల్లింది.

ఆంధ్రవాఙ్మయచరిత్రలో మహోన్నతప్రతిభాసంపన్నులైన కవిరాజులతోబాటు, సాహితీసరస్వతి మకుటాన మాణిక్యాలై నిలిచిన రాచకవులు కూడా ఉన్నారు. అలాంటివాళ్ళలో కుమారసంభవకర్త నన్నెచోడుడు, ఆముక్తమాల్యదకర్త కృష్ణదేవరాయలు ముందుగా పేర్కొనదగినవాళ్ళు. ఈ కవిరాజులిద్దరూ, అన్వయకాఠిన్యతను తమ కవితాలక్షణాలలో ఒకటిగా చెప్పకుండానే చొప్పించి తమ రాచఠీవిని ప్రదర్శించుకున్నారు.

ఇప్పుడు మనం మాట్లాడుకోబోయే పద్యం నన్నెచోడుని కుమారసంభావంలోనిది. సాహితీసమరాంగణ సార్వభౌముడైన రాయల వలె స్వర్ణయుగ ప్రతిష్టాపకుడు, కవిపండిత పోషకుడుగా పేరు పొందకపోయినా తొలిసారిగా సలక్షణమైన లక్షణాలతో ప్రబంధరచనాధోరణికి శ్రీకారం చుట్టినవాడు నన్నెచోడుడు. ఇతని కుమారసంభవం నిస్సందేహంగా "ప్రతిభార్ణవోదీర్ణ రుచిరమైన కావ్యం".

**క. కని కోపించెనో కానక**
**మును కోపించెనో, మహోగ్రముగ నుగ్రుఁడు చూ**
**చినఁ గాలెనో, చూడక యట**
**మును గాలెనో, నాఁ గ నిమిషమున నఱఁ గాలెన్**

**- కుమార సంభవం. పంచమాశ్వాసం . 51**

- అన్న పై పద్యం నాకు, మీకు నచ్చడమే మాత్రమే కాదు ఒకవేళ సాక్షాత్తు కుమారసంభవకర్త అయిన కాళిదాసు దిగి వస్తే, అతనికి కూడా బహుబాగా నచ్చేస్తుందని, నేను కాదు, మహామహులైన విమర్శకులెందరో చెప్పేరు.

ఏ విషయానికైనా సంగతి సందర్భం ఉండాలన్నారు. ముందుగా ఈ కందానికి ముందు ఏముందో చూసి ఆతర్వాత అందులో ఏముందో చూద్దాం. పంచమాశ్వాసంలోని ఈ పద్యంలో ఉన్నవి నాలుగు ముక్కలే కాని ముందు మాత్రం నాలుగాశ్వాసాలున్నాయి. వీటిలో మొదట సతీపరమశివుల ప్రణయం, గజాననుని జననం, గణాధిపత్యం, దక్షయజ్ఞం, సతీదహనం, పార్వతి జననం వరకు జరుగుతాయి. అటు తరువాత, హిమవత్పర్వతాన తపస్సు చేసుకోవడానికి వచ్చిన శివునికి పరిచర్యలు చేయడానికి హిమవంతుడు పార్వతిని నియమించడం జరుగుతుంది. ఈలోపున తారకాసురుడి వల్ల కలుగుతున్న బాధలను భరించలేక ఇంద్రాది దేవతలు

బ్రహ్మదేవునితో మొరపెట్టుకుంటారు. పార్వతీపరమేశ్వరులకి జన్మించే కుమారుని చేతిలో గాని తారకుడు చావడని బ్రహ్మసెలవిస్తాడు. అప్పుడు ఇంద్రుడు మన్మధుడిని రావించి, శివపార్వతులని కలపమని కోరుతాడు. మన్మధుడు అదెంత పని అని దంభాలు పలికి బయలుదేరుతాడు. ఇల్లాలు రతీదేవి హితవు చెప్పబోతుంది. ''ఇంద్రుడు నీపై అసూయకొద్దీ ఈ నెపంతో నీ అడ్డుతొలగించుకోవడానికి పన్నిన పన్నాగం'' అంటుంది. ''శివునితో నీకు పోరేమిటి? ఆశివుని ధనువు మేరువైతే నీ విల్లు చెరుకుగడ, అతని శరం పాశుపతం, నీ బాణం తాకితే కందిపోయే కుసుమం. ఆతడు త్రిపురాంతకుడు, నీవు విరహులను వేధించేవాడివి. ఆ పరమశివుడికి నీకు హస్తిమశకాంతరమైన వ్యత్యాసం ఉంది నామాట విను. అసాధ్యుడైన ఆ శివుని సాధించే ప్రయత్నం మానుకో '' అని బతిమాలింది, భయపెట్టింది. అయినా ఆ మాటలు పెడచెవిని పెట్టి బయలుదేరేడు ఆ మన్మధుడు.

పరమశివుడు హిమవంతం మీద తపోదీక్షలో ఉన్నాడు. అక్కడికి మన్మధుడికంటె ఒక అడుగు ముందుగానే వసంతశోభ వచ్చింది. కాని శివునితపస్సుకు ఆటంకం అయిన ఆ కోలాహలం అంతా, నంది కనుసన్నతో చిత్తరువులా స్తంభించి పోయింది. మలయపవనుడు కూడా దుమ్ముకొట్టుకుని పోయాడు. ఈ అపశకునాలని గమనించి మన్మధుడు జంకుతో తమాలపుతీగెలు దట్టంగా అల్లుకున్న అశోకవృక్షం చాటున దాగి పార్వతి రాక కోసం ఎదురుచూడసాగాడు. ఇంతలో కల్పవృక్షపు తీగెలా పార్వతి ప్రవేశించింది. రతిరాజు తన పని ప్రారంభించి ముందుగా ఉమాదేవి మీద, అటుతరువాత ఆ పినాకపాణి మీద పూబాణాలను ప్రయోగించాడు. దానితో ఆ అచలాత్ముడు సమ్మోహితుడై అచలాత్మజ వంక చూశాడు. కాని మరుక్షణం తన చిత్తచాంచల్యానికి కారణం మేమిటా అని కలయ జూశాడు. చీకటితీగెల చాటున దాగి, ఇంద్రధనుస్సు పట్టుకుని మబ్బులలో నిలబడ్డ ఇంద్రునిలా ఉన్న మన్మధుడు కంటబడ్డాడు. అంతే.. ఆగ్రహంతో ఫాలనేత్రాన్ని తెరవగా విస్ఫులింగాలను వెదజల్లుతూ లేచిన అగ్నిజ్వాల వలరాజును బుగ్గిచేసి యధాస్థానానికి చేరుకుంది.

పై పద్యం ఈ సందర్భంలో చెప్పినది. శివుని పైకి ఎత్తివచ్చిన మన్మధుడు రెప్పపాటుకాలంలో కాలి బూడిదై పోయాడు – అన్న ఈ వర్ణనకి కవి ఎంచుకున్న ఛందస్సు, పదాలు మామూలుగా తక్కిన కావ్యాల్లో వలె కనబడవు. వర్ణనకి మత్తేభమో, శార్దూలమో వంటి ఛందస్సు ఎంచుకుంటే అవకాశం, సౌలభ్యం ఎక్కువగా ఉంటాయి. చిన్ని,చిన్ని పదాలని, అంతకన్నా చిన్నదైన పద్యాన్ని ఎంచుకోవటంలో ఉన్న విశేషం ఏమిటో చూద్దాం.

లోకంలో సాధారణంగా ఇలా క్షణంలో జరిగిపోయిన భయంకర సంఘటనని చూసిన వాళ్ళు మళ్ళి మళ్ళి దాన్ని తలుచుకోవడం వింతపడడం సహజం. ఇలాంటి సందర్భంలో ''ఎంత ఘోరం'', ''ఎంత పని జరిగింది'', ''ఎంత భయంకరమో'' అంటూ క్లుప్తంగా భావవ్యక్తీకరణ జరుగుతుంది. కథను చెబుతున్న కవి కూడా అదే పని చేశాడు.

ఆ శూలి మన్మధుడిని చూసి కోపించాడో, చూడడానికి ముందే కోపించాడో, శివుడు మహా భయంకరంగా చూసినప్పుడు ఆమన్మధుడు కాలేడో, చూడడానికి ముందే కాలిపోయాడో అన్నట్టుగా రెప్పపాటులో కాలి నశించి పోయాడు.

– అన్నది పై పద్యానికి అర్థం.

ఆ నిటాలాక్షుడికి కోపం వచ్చింది. అయితే ఈ కోపం మన్మథుడిని చూశాక వచ్చిందో ...చూడక ముందే వచ్చిందో... చెప్పడానికి వీలులేదు. అలాగే ఆ పూవిలుకాడు శివుడు చూడగా కాలిపోయాడో, లేక చూడకముందే కాలిపోయాడో కూడ విడమరచి చెప్పడానికి కుదరని విధంగా త్రుటిలో జరిగిపోయింది కామదహనం.

ఇది నిజంగానే క్షణంలో జరగవలసిన పనే. శివుని ఆయుధం ముల్లోకాలని భస్మం చెయ్యగల మూడోకన్ను. అది రెప్పపాటుకంటే ఎక్కువ తెరిచి ఉంటే .... అన్నది తలుచుకోవడానికే భయం వేసే విషయం. భగవంతుడికి "అనుకోవడం లేదా సంకల్పం, చెయ్యడం లేదా కార్యం" అన్నవి రెండు కాదు ఒకటే. మధ్య వ్యవధానం అంటూ ఉండదు. అందుకే క్లుప్తంగా చెప్పడం అన్నది ఎంతో చక్కగా నప్పింది, ఒప్పింది.

ఎంచుకున్న పదాలు వాటిలో ఉన్న పొందిక అద్భుతం. "కోపించెనొ", "కాలెనొ" అన్న క్రియాపదాలు హ్రస్వాంతాలు కావడం, పర్యాయపదాలు వాడకుండా, మళ్ళీ వాటినే ప్రయోగించడం అన్నది అందమైన పొందిక. తొందరలో విషయాన్ని చెప్పేటప్పుడు దీర్ఘాలు తియ్యటానికి తీరిక ఎక్కడిది? అంతేకాదు ఘోరమైన సంఘటనకి బిత్తరపోయి,చిత్తరువులైనప్పుడు మరో మాట వెతుక్కుందుకు కుదురు ఎక్కడ ఉంటుంది?

నన్నెచోడుడు కావ్య పీఠికలో మంచి కవిత ఎలావుండాలో వివరిస్తున్న సందర్భంలో ........

**క. ముదమునఁ గవికృత కావ్యము**
**నదరున విలుకాని పట్టినమ్మును బరహృ**
**ద్భిదమై తల యూఁపును, బెఱ**
**యది కావ్యమె చెప్పఁ ?బట్ట నదియున్ శరమే**

(ఆనందానుభూతిని కలిగిస్తూ సుకవి చెప్పిన కావ్యము, భయాన్నికలిగిస్తూ విలుకాడు పట్టిన బాణము, పఠితహృదయంలోను, శత్రువుహృదయంలోను నాటుకుని శిరఃకంపన చేయించాలి. అలాకాక పోతే, ఆ చెప్పినది కావ్యమా? ఆ పట్టినది బాణమా? )

- కుమారసంభవం . ప్రథమాశ్వాసం. 41

- కవి కావ్యం ఇలా ఉండాలి అని రాచఠీవితో నన్నెచోడుడు తానే చెప్పుకున్న పై లక్షణానికి ఇదొక చక్కని లక్ష్యం. భావాన్ని సూటిగా పఠిత హృదయంలో నాటి, ఆనందంతో తలలూపించే పద్యం ఇది.

●●●

**మ. అజినాషాఢధరుండు, ప్రౌఢతరభాషాప్రగల్భుండు, నీ**

**రజబంధుప్రతిమానతేజుడు, జటారాజిచ్ఛటాతామ్రమూ**

**ర్ధజుడేకాకి, వటుండు, బ్రాహ్మణుడు, విశ్రామార్థముం బోలె నా**

**త్రిజగన్మోహనమూర్తి సన్నిధికి నేతెంచెన్  వనాంతంబునన్**

**- హరవిలాసం,చతుర్థాశ్వాసం, పద్యం.15**

ఈ పద్యం శ్రీ నాథుని హరవిలాసం లోనిది. ఇది నాకే కాదు చాలా మందికి నచ్చిన పద్యం అని నా నమ్మకం. ఎందుకంటే శ్రీనాథుడు అలాంటి గుణాలని ఈ పద్యంలో పొందుపరిచాడు. అంతకుమించి, సమాసాల విరుపు చదువరి నోటికి ఒదిగి, అతిసులువుగా కంఠోపాఠంగా వచ్చే పద్యం ఇది.

చిన్నారిపొన్నారిచిరుతకూకటి నాడు మరుత్తరాట్చరిత్రతో మొదలు పెట్టి, జీవనసంధ్యాసమయం దాకా నిరాటంకంగా కావ్యరచన సాగిస్తూనే వచ్చాడు ఈ మహాకవి. "వచియింతు వేములవాడ భీమన భంగి ఉద్దండలీల నొక్కొక్క మాటు...." అంటూ ఢంకా దెబ్బ కొట్టినట్టుగా చేప్పుకోవడమే కాదు, ఆ చెప్పిన ఒరవడులని తన కవితలో చూపించిన సమర్థుడు శ్రీనాథ కవి సార్వభౌముడు.

పైన చెప్పిన పద్యం హరవిలాసకావ్యంలో చతుర్థాశ్వాసంలో ఉంది. ఈ కావ్యంలో మొదటి రెండాశ్వాసాలు చిరుతొండనంబి కథ. దీనికి ఆధారం ఆయన తమిళదేశంలో విన్న శివకథలు, పాల్కురికి సోమనాథుని బసవపురాణం. తృతీయాశ్వాసంనుంచి తారకాసురవృత్తాంతం, పార్వతితపస్సు, గౌరీకళ్యాణం ఆదిగాకల కథలన్నీ కాళిదాసు కుమారసంభవాన్ని అనుసరిస్తూ చేసిన అనువాదం.

ఇంద్రునితో చేతులు కలిపిన మన్మధుడు, హిమాలయాల్లో పార్వతిచే పరిచర్యలు పొందుతున్న శివునికి, ఆమె పై ప్రేమ చిగురింపచేసి, కుమారసంభవానికి నాంది పలుకుతానని ప్రగల్భాలాడి, పటాటోపంగా బయలుదేరి, పట్టెడు బూడిదవుతాడు.

అటు తరువాత ఆ పసుపతినే పతిగా పొందాలనే కోర్కెతో పార్వతి పాశుపతదీక్ష వహించి తపస్సు ప్రారంభిస్తుంది. కొంతకాలానికి కపట వటుని రూపంతో పార్వతి తపస్సు చేసుకుంటున్న చోటికి వచ్చిన శివుని యొక్క వర్ణన ఇది.

శ్రీనాథుని రచనలన్నీ ఇంచుమించుగా అనువాదాలే అయినా విద్వాంసులు, విమర్శకులు అంతా శ్రీనాథుడు కవిసార్వభౌముడన్నది నిర్వివాదాంశం అన్నారు. అనువాదం చెయ్యడం అన్నది పూర్వపురోజుల్లో ఆచరణీయమైన సాంప్రదాయం. ఆ పంథాననుసరించి తనకు నచ్చిన మహాకావ్యాలని ఆంధ్రీకరించాడు. ఇక ఈ కవి చూపే ప్రజ్ఞ ఏవిటి అంటే, సంస్కృతాంధ్రాలలో తనకున్న ఉద్దండపాండిత్యప్రకర్షని ప్రకటితం చెయ్యడం. మూలంలో అనుచితమైన వాటిని త్యజించడం. అందాలు చిందే వాటికి మరిన్ని అలంకారాలు చేసి మెరుగులు దిద్దడం. తన జాతి సంప్రదాయాలని,పలుకుబడిని, కవితలో సుతారాంగా చొప్పించటం, మూలంలో ఉన్న పాత్రలని, వాటి పోకడలని కొత్త పుంతలలో నడిపించి, వాటిని తన సొంతం చేసుకోటం.

ఈ పద్యంలో చెప్పబడినది....

"జింకచర్మాన్ని,మోదుగదండాన్ని ధరించినవాడు, గొప్పభాషా నైపుణ్యం గలవాడు, సూర్యునితో సమానమైన కాంతి గలవాడు, ఒంటరివాడు అయిన బ్రహ్మచారి, అరణ్యంమధ్యలో విశ్రాంతి తీసుకోవడానికి వస్తున్నాడా అన్నట్లుగా, ముల్లోకాలను మోహింపజేసే రూపంగల ఆ పార్వతి దగ్గరకు వచ్చెను." అని.

ముందుగా ఇలా వచ్చిన శివుడు ఏం చేసేడో చూసి, అప్పుడు పద్యం ఎలా ఉందో పరిశీలిద్దాం. అలా వచ్చిన ఆ వటువు పార్వతిచే సన్మానింపబడి, కుశలప్రశ్నలతో ప్రారంభిస్తాడు. " ఆ హిమవంతుడు దేవగంగ తనమీద ప్రవహించడం వల్ల కాదు, నీ వంటి కుమార్తె కలగడం చేత పవిత్రుడయ్యాడు" అని ప్రశంసిస్తాడు. అంతటితో ఆగక, "సంబంధంబు సాప్తపదీనంబు", "నీతో ఇంతసేపు మాట్లాడేను కాబట్టి నీకు ఆప్తుడిని, అందుకని నువ్వు ఎందుకు తపస్సు చేస్తున్నావో చెప్పు" అంటూ ఇంకొంచం ముందుకు వెళతాడు. చివరకు – "నేను బ్రహ్మచారిని, నీవు కన్యవు, ఇంకా ఎంతకాలం ఇలా వుంటావు? నన్ను వివాహమాడు. లేదంటే నా తపోఫలంలో సగం నీకిస్తాను. ఇంకా ఈ దీక్ష మానెయ్యి" అని కొంటెగా అడుగుతాడు.

అప్పుడు పార్వతి చెలికత్తెలు కలిగించుకుని, "ఆ పరమశివుని పతిగా పొందటానికే ఈమె తపస్సు చేస్తోంది" అని చెబుతారు. అదివిని వెక్కిరింతగా వికవిక నవ్వి, శంకరుని గురించి నిశ్శంకగా వంకర కొంకర మాటలాడుతాడు. దాంతో ఆ జగదంబ ఆగ్రహించి చెలికత్తెలతో "ఇతని మెడపట్టి నూకుండు" అని ఆజ్ఞాపిస్తుంది. తన వాచాలత్వాన్ని ఇంతవరకు తీసుకొస్తాడు కపటవటుడు.

ఇక పద్యం చూద్దాం.

జింక చర్మం, పలాశదండం,సూర్యతేజం, బ్రాహ్మణ్యం, ఇదంతా మామూలే. ఇక పోతే "ప్రౌఢతరభాషాప్రగల్భత" ఇదే అతని "వంకరకొంకర" మాటలకి, "నీకు పెళ్లిమీద కోర్కె ఉంటే నన్ను చేసుకో" అనడానికి దారి తీసిన గుణం. "ప్రగల్భత " పదానికి, "పాండిత్యం" అన్నది అర్థం అయినా, దీన్ని కాస్తగర్వంతో కూడిన మాటలు పలికేవాళ్ళ లక్షణంగా చెప్పుకోవడం లోకసాధారణమైన విషయం. "ఏకాకి" ఒంటరి వాడు. వెనుకముందుగాని, తోడ వచ్చిన వారు గాని, ఎవరూ లేరు. అందుచేత అతని ప్రవర్తనని, వాచాలత్వాన్ని వారించి, హద్దు మీరుతున్నావు సుమా! అని హెచ్చరించే వారు లేరు. దానివల్ల మెడపట్టి అవతలికి నేట్టబడే పరిస్థితికి వచ్చేడు.

అప్పటికే అరుదైన గౌరి తపస్సుకి అమ్ముడుపోయిన ఆదిశంకరుడు, ఆమెను సమీపించి, ఇలాంటి సంభాషణ చేయడానికి దారితీసిన తొలి పలుకులకి ఏదో సాకు ఉండాలి. ఊరికే ఎవరింటి తలుపో తట్టి వాళ్ళతో ఇటువంటి మాటలు మొదలుపెట్టడం అసహజం. అందుకని విశ్రామార్ధముం బోలె, అలిసిపోయి విశ్రాంతి తీసుకోవడానికి వస్తున్న బ్రాహ్మణ వటువు రూపంతో ముల్లోకాలను భ్రమింప చేసే ఆ సౌందర్యమూర్తి సన్నిధికి శివుడు ఏతెంచాడు. అనడం ఒప్పినట్టుంది.

ఇలా మూలాన్ని అనుసరించి రూపొందించిన ఈ పద్యంలోని చమత్కారం, అక్షరరమ్యత పాఠకుల మనసులో ముద్రవేసుకుని, కలకాలం గుర్తుంచుకునే విధంగా కల్పించిన శ్రీనాధుని శైలి శోభాయమానం అనే చెప్పాలి.

సీ. తనువున నంటిన ధరణీపరాగంబు పూసిన నెఱి భూతి పూత గాఁగ

ముందట వెలుఁ గొందు ముక్తాలలామంబు తొగలసంగడికాని తునుక గాఁగ

ఫాలభాగంబుపైఁ బరగు గావలిబొట్టు కాముని గెల్చిన కన్ను గాఁగ

కంఠమాలికలోని ఘన నీలరత్నంబు కమనీయమగు మెడకప్పు గాఁగ

ఆ. హారవల్లు లురగహారవల్లులు గాఁగ

బాలులీల ప్రౌఢబాలకుండు

శివుని పగిది నొప్పె శివునికిం దనకును

వేఱులేమిఁ దెలుప వెలయునట్లు.

\- భాగవతం. దశమస్కంధం. పద్యం. 296

తెలుగు గడ్డమీద పుట్టిన ప్రతివాడు తనకున్న చదువుసంధ్యలతో ప్రమేయంలేకుండానే "ఊరకరారు మహాత్ములు", ‘‘వారిజాక్షులందు,వైవాహికములందు", ‘‘ వటుడింతై" అంటూ జంకు గొంకు లేకుండా పోతన్నగారి మాటలని తన సొంతం చేసేసుకుని మాట్లాడుతాడు అనడం అతిశయోక్తి కాదు.

లోకంలో మనకు మంచి ఆదృష్టం అబ్బినప్పుడో, శుభం జరిగినప్పుడో నలుగురి నోళ్ళు తీపిచెయ్యడం కద్దు. పోతన్నగారు భాగవత పీఠికలో ‘‘శ్రీకైవల్య పదంబు చేరుటకు’’ భగవంతుడిని ప్రార్థించి, ‘‘పునర్జన్మ లేకుండా భాగవతాన్ని వ్రాస్తాను’’ అని చెప్పుకున్నారు. తనకు కైవల్యం లభిస్తుందని ముందుగానే ఖండితంగా తెలిసి నట్టుగా, తనకు పట్టబోయే భాగ్యాన్ని తలుచుకుని, ఆ సంతోషాన్ని నలుగురితో పంచుకున్నట్టు తన రసగుళికల లాంటి పద్యాలని ప్రతి తెలుగువాడి నోటా పోశాదు బొమ్మెర పోతన్న.

నిజానికి దేవుడిని తలుచుకోవడానికి, కొలుచుకోవడానికి వేదాలు వల్లెవేయక్కర్లేదు, ఉపనిషత్తులు ఔపోసన పట్టక్కర్లేదు, యజ్ఞాలు,యాగాలు చెయ్యక్కర్లేదు పోతనగారు వ్రాసిన నాలుగు పద్యాలు రోజు చదువుకుంటే చాలు. ఇలాగ పరలోకాన్ని కరతలామలకంగా అందించిన పోతన్నగారికి ఆంధ్రులు ఎప్పటికీ ఋణపడే ఉంటారు.

పైన చెప్పిన పద్యం పోతన్న వ్రాసిన వందలాది పద్యాలలో ఒకటి. చదువరులకి పోతన్న కవితారసం ఎంత త్రాగినా తనివి తీరని అమృత రసధార. వసుదేవుడు తన పక్కలో ఉంచిన చిన్న పాపడిని తన బిడ్డ అనుకుని యశోదమ్మ పెంచింది. శ్రీకృష్ణుడు, బలరాముడు రేపల్లెలో బాల క్రీడలాడుతున్న సందర్భం లోనిది ఈ పద్యం.

“కవయః నిరంకుశాః” కవి నిరంకుశుడని ఆలంకారికులు చెప్పిన మాట ఒకటి ఉంది. అంటే తనకి ఇష్టం వచ్చినట్టు వ్రాసుకుపోతాడన్న అర్థాన్ని మాత్రమే తీసుకోకూడదు. ఇతరుల కంటె భిన్నంగా వస్తువుని చూడడం కవికి ఉన్న ప్రతిభలలో ఒకటి. కవి తను కనుగొన్న సొబగులని రమ్యాతి రమ్యమైన చిత్రంగా తీర్చిదిద్దగలడు. అంతేకాదు, ఒక్కొక్క సారి తాను చూడదలుచుకున్నదే చూస్తాడు. చూడగలడు కూడాను. “ ఆటలాడుతున్న కృష్ణుడు పరమశివుని వలె కనబడుతున్నాడు” అని దీనిలో హరిహరాద్వైతం ప్రతిపాదించబడింది. తిక్కనాది కవులు అంతకు పూర్వం చేసినదే అయినా. కథలో ఒక భాగంగా చక్కటి ఉపమలను ఎంచుకుని, వాటిని ప్రస్తుతాంశంతో చక్కగా మేళవించడం ఇందులోని ప్రత్యేకత.

వాకిటిలో ఆడుకుంటున్న కృష్ణుడిని, యశోద చూస్తోంది. గోపికలు, గోపాలురు చూస్తున్నారు. వీళ్ళు వాళ్ళు అనడం ఎందుకు సమస్తమైన గోకులం పారవశ్యంతో చూస్తోంది. పరమాత్మ ఆటలు చూసే భాగ్యం అబ్బినవాళ్ళకి పారవశ్యం కాక మరే అవస్థ కలుగుతుంది. వాళ్ళందరు చూస్తున్నది ముచ్చటగా ఆడుకుంటున్న యశోదమ్మ ముద్దుబిడ్డడిని. మరి పోతన్న చూసింది ఇది.

“ఆడుకుంటున్న వాడు కృష్ణుడైనా నాకు మాత్రం శివుడిలా కూడా కనుబడుతున్నాడు” అంటాడు. సమర్థుడైన వాడు ఏమన్నా చెల్లుతుంది. పైపెచ్చు చేవగలవాడు కాబట్టి ఆ సమర్థన అద్భుతంగా చేస్తే, కాదనడానికి దమ్ములు ఉండద్దూ? ఇలా జరిగింది ఆయన సమర్థన.

తనువున అంటిన ధరణీ పరాగము( వంటికి అంటుకున్న మట్టి ) పూసిన నెటి భూతి పూత గాcగ ( వంటికి పుసుకున్న చక్కటి విభూతి పూత అయిందట)

ముందట వెలుc గొందు ముక్తాలలామంబు ( ముందు కనబతుతున్న మెరిసే ముత్యాల దండ) తొగలసంగడికాని తునుక గాc గ – తొగల సంగడికాడు(కలువల చెలికాడు అంటే చంద్రుడు) తునుక కాగ (ముక్క అయినట్టుగా ఉందట)

ఫాలభాగంబుపైc బరగు గావలిబొట్టు(నొసటి మీద ఉన్న ఎర్రని బొట్టు) కాముని గెల్చిన కన్ను గాcగ (మన్మధుడిని జయించిన కన్ను అన్నట్టు ఉంది)

కంఠమాలికలోని ఘన నీలరత్నంబు(మెడలో ఉన్న రత్నహారంలో ఉన్నఘన నీలమణి ) కమనీయమగు మెడకప్పు గాcగ (అందమైన మెడమీది నల్ల మచ్చ అయింది)

హారవల్లులు ఉరగహారవల్లులు గాఁగ (మెడలోని ముత్యాలహారాలు చుట్టలుగా చుట్టుకుని సర్పమాలలుగా కబడుతున్నాయి)

- ఇక్కడి దాకా కృష్ణుడి రూపు రేఖల వర్ణన.

తండ్రి అయిన ఆ నందుడేమో గోకులానికి నాయకుడు. మరి ఆ నాయకుడి ఇల్లాలైన యశోద లేక లేక పొందిన పుత్రుడికి సామాన్యమైన అలంకారాలు చేస్తుందా? వంటిమీద పట్టు పీతాంబరాలు, నొసట బొట్టు, కొప్పులో ముత్యాలు, మెడలో ముత్యాలసరాలు, రత్నాలహారాలు, ఇది ఆబాల కృష్ణుని ఆహార్యం.

ఆటలో పడ్డ కృష్ణుడికి వళ్ళంతా ధూళి, తలమీదనుంచి జారి నుదట పడుతున్న ముత్యాల దండ, చిక్కుపడి చుట్టలుగా చుట్టుకున్న మెడలోని ముత్యాలసరాలు. ఇది ఆయన అవతారం. ఈ వేషాన్ని ఇలా చూస్తున్నారు పోతన్న.

‘‘బాలులీల ప్రౌఢబాలకుండు
శివుని పగిది నొప్పె శివునికిం దనకును
వేఱులేమిఁ దెలుప వెలయునట్లు.’’

కృష్ణుడు బాలుడిలా కనబడుతున్నాడు. కాని అతడు ఎదిగినవాడు, ఎరిగినవాడు. అందుకే శివుని లాగ కనబడుతూ,తనకు ఆ పరమేశ్వరుడికి తేడా ఏమీ లేదుసుమా అని తెలియజేస్తున్నట్టుగా ఉన్నాడుట.

మరి దీన్ని సమర్ధించడం ఎలా అంటే... ఆటలలో కిందా మీదా పడి నేలనున్న మట్టి కాస్తా ఒంటికి అంటింది. అదేమో శివుడు పూసుకునే విభూతేమో అయింది. కొప్పులో తురిమిన ముత్యాలదండ చంద్రవంకగా తోస్తోంది. నుదుటనున్న చక్కటి ఎర్రబొట్టు మన్మథుడిని బూడిద చేసిన మూడో కన్ను అయింది. మెడలో ఉన్న హారం తాలూకు పెద్ద నీలపురత్నం కంఠభాగాన్నికప్పివేసి, గరళకంఠుని కంఠాన్నితలపింపజేస్తోంది. ఆటల హడావుడిలో చిక్కుబడి చుట్టుకు పోయినా ముత్యాలదండలు శివుని మెడలో చుట్టుకున్న సర్పహారాలుగా కనబడుతున్నాయి. సాక్షాత్తూ.. నేర్పులన్నీ నేర్చిన ఆ నేర్పరి, శ్రీ కృష్ణుడే ‘‘చూడు నాకు ఆ శివుడికి తేడాలేదు’’ అని చెబుతున్నట్టుగా ఉన్నది - అన్న ప్రతిపాదనని అతిప్రతిభావంతంగా చేశాడు కవి.

ఇంత చక్కగా అమరిన వేషాన్ని చూపించేక ఇతడు శివుడిలా కనబడటం లేదని మనం మాత్రం ఎలా అనగలం? చెయ్యిగలిగింది, చెయ్యవలసింది ‘‘లెస్సగా చెప్పేవన్నా! పోతన్నా!’’ అనడం ఒక్కటే.

లోకంలో అప్పుడప్పుడు కొంతమంది తమ ప్రతిభతో సమకాలికులనే కాదు భావితరం వాళ్ళని కూడ అబ్బురపరచి, తమ కాలం కంటే ముందుగా పుట్టారేమో అనిపిస్తారు. ఇలాంటి వాళ్ళలో పదహారో శతాబ్దంలో కళాపూర్ణోదయాన్ని వ్రాసిన పింగళి సూరన ఒకడు. పింగళి సూరన, తనకాలానికి ముందున్న ప్రబంధాల్లో లాగ కథను ఏ పురాణాల్లో నుంచో ‘‘కాపీ’’ కొట్టకుండా తానే స్వయంగా సృష్టించాడు. ఇది అక్షరాల అపూర్వమైన ఇతివృత్తం. ఈ ప్రబంధంలో ఉన్న కథాకథన పద్ధతి అంటే కథ చెప్పిన విధానం, దీనికి తెలుగు సాహిత్యంలో మొట్టమొదట పుట్టిన నవల అన్న ఖ్యాతిని తెచ్చింది.

మ. తమిఁ బూఁ దీఁగేలఁ దూగుటుయ్యేలలఁ బంతా లాడుచుం దూఁ గు నా
కొమరుం బ్రాయపు గబ్బిగుబ్బెతల యంఘ్రుల్ చక్కగాఁ జాఁగి, మిం
టి మొగంబై చనుదెంచు లీవిఁ గనుగొంటే దివ్యమౌనీంద్ర ! నా
కా మృగీనేత్రలమీదఁ గయ్యమునకుం గాల్ సాఁచు లా గొప్పెడున్!

కళాపూర్ణోదయం. ప్రథమాశ్వాసం. 43

మ. బళిరా! సత్కవి వౌదు నిక్కము, తగన్ భావించి నీవన్న యా
యెలఁ బ్రాయంపు మిటారికత్తెల బెడం గే నెందునుం గాన, వా
రల డోలాచలనోచ్చలచ్చరణముల్ త్రైవిష్టప స్త్రీల యా
దలఁ దన్నం జనునట్లు మించెనినం దప్పేమి? యొప్పే యగున్

- కళాపూర్ణోదయం. ప్రథమాశ్వాసం. 45

అన్నవి ఇందులో నాకు నచ్చిన పద్యాలు. వీటిలో చెప్పిన విషయాన్ని బట్టి ఇవి రెండు ముడి పడిన జంట పద్యాలు కాబట్టి విడివిడిగా మాట్లాడుకోవడానికి కుదరదు. ఈ పద్యాల గురించి మాట్లాడుకునే ముందు వీటి సంగతి సందర్భాలు మనం చెప్పుకోవాలి మరి.

అయితే కళాపూర్ణోదయం కథని టూకీగాను, అర్థం అయ్యేట్టుగాను, చెప్పటం ఆ బ్రహ్మ వల్ల కూడా కాదు. తమాషాకి అన్నాలెండి నిజానికి ఈ కథని బ్రహ్మే చెబుతాడు. తనకు సరస్వతికి మధ్య జరిగిన ప్రణయ వృత్తాంతాన్ని ఒక కథలా అల్లి పక్కనున్న చిలకకి చెపుతాడు బ్రహ్మ. బ్రహ్మ సరస్వతికి చెప్పిన కథలోని పాత్రలతో మళ్ళీ ఉపకథలు కొన్నిటిని కల్పించి అల్లిన ఈ రత్నకంబళి మీద కెక్కించి పాఠకులని సత్య, గంధర్వ, మానవ లోకాల మధ్య విహరింప జేస్తాడు సూరన.

ఈ కావ్యానికి నాయిక "కలభాషిణి" అనే కన్య. ఆమె ద్వారకలో ఉంటుంది. నారదుడు తుంబురుడిని మించాలని తన సంగీతవిద్యను పదును పెట్టుకోవడానికి కృష్ణుడి పట్టమహిషలని ఆశ్రయిస్తాడు. అతని వీణను మోసిన కలభాషిణి, నారదుని శిష్యుడైన మణికంధరుడనే గంధర్వుడు కూడా అతనితో బాటు సంగీత విద్యను అభ్యసిస్తారు. అది ఈ మూడు పాత్రల మధ్య ఉన్న సంబంధం. నారదుడు మణికంధరుడిని వెంటబెట్టుకుని సంగీతవిద్యా సాధనకోసం ద్వారకకు బయలుదేరుతాడు. ఇలా బయలుదేరిన గురుశిష్యులు ద్వారకను సమీపించే సమయానికి, ఆ ఊరిలో ఒక ప్రముఖ నటుని కుమార్తె కలభాషిణి తన చెలికత్తెలతో వనవిహారం చేస్తూ ఉయ్యాలలూగుతూ ఉంటుంది. ఆమె అందానికి ఆకర్షితుడైన మణికంధరుడు, ఆ యువతుల సౌందర్యాతిశయాన్ని వర్ణించిన సందర్భం ఇది. శ్రీ కృష్ణుడి మీద దండకం చెప్పి మెప్పుని, మణిహారాన్ని పొందిన కవి మణికంధరుడు, మొదటి పద్యంలో కలభాషిణిని, ఆమె చెలికత్తెలు ఉయ్యాలలూగడాన్నిఇలా వర్ణించాడు.

"మహర్షీ ! చూశారా? ఎంతో ఉత్సాహంతో, ఒకరిని మరొకరు మించుతామని పోటీలు పడుతు, ఈ యవ్వనవతులు ఉయ్యాలలూగుతుండగా, వాళ్ళ పాదాలు చక్కగా సాగి, ఆకాశం వైపుకు వస్తున్న ఠీవి చూస్తుంటే, స్వర్గంలో ఉన్న అప్సరాంగనల మీద కయ్యానికి కాలు దువ్వుతున్నారా అన్నట్టుగా ఉంది." – ఇవి మణికంధరుడి మాటలు.

భూలోకం ఉన్న ఈ ద్వారకా వాసినులైన ఈ సౌందర్యవతులు అందచందాలలో ఆ దేవతా స్త్రీలతో పోటీ పడుతున్నట్టు ఉన్నారు. అన్నది దీని భావం.

ఇక రెండవ పద్యం నారదమహర్షి చెప్పింది.

బహు బాగా చెప్పావయ్యా! మంచి కవివి అనిపించుకున్నావు. నువ్వు చెప్పింది నిజమే . ఈ యువతీమణులలో ఉన్న అందచందాలని నేను మరెక్కడా చూసి ఎరగను. ఊయల ఊపులకి కదులుతూ పైకి లేస్తున్న వాళ్ళ పాదాలు ఆ నాకలోకంలో ఉన్న సౌందర్యవతుల తలదన్నటానికి వెళుతున్నాయి అన్నా కూడా తప్పులేదు. అది ఒప్పే అవుతుంది. వీళ్ళ సౌందర్యాతిశయంలో అంతటి ఠీవి ఉంది సుమా! - అంటూ వత్తాసు పలికాడు నారదుడు.

ఈ పద్యాలు జంట కవుల్లా ఉన్నాయంటే, చెప్పిన వాళ్ళిద్దరు చెప్పిన తీరు జంటకవుల కవిత్వంలా ఉంది. ఒకటి సత్కవి అయిన మణికంధరుడు చెప్పినది, మఱొకటి అతని గురువు దేవర్షి అయిన నారదమహాముని చెప్పినది. నిజానికి ఈ సంభాషణలో ఈ పాత్రలు రెండు ఒకరి భావాన్ని మరొకరు సమర్ధించడమే కాక దాని ఔన్నత్యాన్ని మరొక స్థాయికి తీసుకువెళతారు. ఇది జంటకవులకి సహజ లక్షణం. అదే ఇందులోని అందం. శిష్యుడు ఆ అందగత్తెలు దేవతావనితలను పోటీపడి కయ్యానికి కాలుదువ్వుతున్నట్టున్నారంటే, గురువు ద్వారకలోని ఈ స్త్రీలు సౌందర్యంలో పైనున్న ఆ అప్సరసలనే తలదన్నేటట్టుగా ఉన్నారని. శిష్యుని భావాన్ని సమర్ధించి, మరో మెట్టు పై కి తీసుకువెళతాడు.

అంతే కాకుండా రెండు మత్తేభ వృత్తాలు కావడం మరో విశేషం. ద్వారకలోని ఈ నారీమణులు పోటీ పడుతున్నట్టుగా చెప్పబడింది. పోటీలో పాల్గొనే వాళ్ళు రీవి, అతిశయం ప్రకటించడం సహజం. అలాంటి విషయాన్ని వర్ణించడానికి మత్తేభాన్ని ఎంచుకోవడం అన్నది ఎంతో ఒప్పినట్టుగా ఉంది.

పున్నమరేలఁ దత్పురము పొంతనె పో శిఖరాళి దాఁకి, వి
చ్ఛిన్నగతిన్ సుధారసము చింది పయిన్ దిగువాఱ నంతనుం
డి న్నెల సన్నగిల్లు; నదినిక్కము గాదనిరేని యా పదా
ర్వన్నె పసిండి మేడలకు రాఁ బని యేమిల సౌధనామముల్

- విజయవిలాసము. ప్రధమాశ్వాసం . 7

నాకు నచ్చిన ఈ పద్యం చేమకూర వేంకటకవి రచించిన విజయవిలాస ప్రబంధంలో ప్రధమాశ్వాసంలో ఉంది. చరిత్రలో మహారాజులు కవిరాజులకి కనకాభిషేకాలు చెయ్యడం విన్నాం. అలాగే జైత్ర యాత్రలు చేసిన యువరాజులని మహారాజులు అభినందిచడం చారిత్రిక విషయమే. పదిహేడో శతాబ్దంలో తంజావూరిలో యువరాజుగా ఉన్న రఘునాధ నాయకుడు, ఒక రాత్రివేళ వ్రాయసగాళ్ళని పక్కన కూర్చోబెట్టుకుని, ఆరుగంటల్లో ఆశువుగా "పారిజాతాపహరణం" అనే ప్రబంధాన్ని చెప్పగా, సంతోషంతో తబ్బిబ్బైన అతని తండ్రి (మహారాజు) అచ్యుతనాయకుడు, నిండుకొలువులో కొడుక్కి కనకాభిషేకం చేసి సత్కరించాడుట. ఇది అపూర్వమైన విషయం మరి. ఇలాంటి రఘునాధనాయకుని కొలువున ఉండి, "ప్రతి పద్యమునందు చమత్కృతి కలుగంగ చెప్పనేర్తువు...క్షితిలో నీమార్గమెవరికిన్ రాదు సుమీ" అని అతని చేత మెప్పుదల పొంది, ముంజేతికి ముత్యాల కడియం తొడిగించుకున్నవాడు చేమకూర వేంకటకవి.

మూడాశ్వాసాలతో ముచ్చటైన విజయవిలాస ప్రబంధం, ప్రతిపద్యచమత్కృతికి, సరళసుందరమైన శైలికి పేరెన్నికగని, తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. "చేమకూర మంచి పాకాన పడింది" అని ప్రసంశలు పొందిన కవి. తెలుగు సాహిత్య ధోరణి క్షీణయుగంలోకి మళ్ళే ముందు సాహిత్యాంబరాన చక్కని చుక్కై మెరిసినవాడు చేమకూర వెంకటకవి.

అర్జునుడు తీర్థయాత్రలు చేస్తూ ఉలూచి,చిత్రాంగద, సుభద్రలని వివాహమాడడం అన్నది ఈ ప్రబంధంలో ఉన్న కథ. ద్రౌపదిని వివాహమాడిన పంచపాండవులకి ఒక నియమం ఉంది. దాని ప్రకారం ద్రౌపది ప్రతి ఏడు ఒక్కొక్క భర్తతో ఉండటం జరుగుతుంది. ఆ

సమయంలో తక్కిన నలుగురు పాండవులు, వాళ్ళున్న మందిరానికి రాకూడదు. ఒకవేళ ఈ నియమాన్ని ఏకారణంచేత నైనా అతిక్రమించిన వాళ్ళు ఒక సంవత్సరం పాటు భూప్రదక్షణ చెయ్యవలసి ఉంటుంది.

ఒకనాడు అర్జునుడు ఒక బ్రాహ్మణుడిని రక్షించడం కోసం తన ధనుర్బాణాలని తెచ్చుకునే హడావుడిలో నియమాన్ని మరచి ద్రౌపదితో ఉన్న ధర్మరాజు మందిరంలో ప్రవేశిస్తాడు. ధర్మరాజు ఎన్ని విధాల ఫరవాలేదు అని నచ్చచెప్పినా వినక తీర్థ యాత్రలకు బయలుదేరుతాడు. అతని ప్రయాణంలో మొదట నాగకన్య అయిన ఉలూచిని, తరవాత పాండ్యరాజ పుత్రి అయిన చిత్రాంగదను, చివరకు ద్వారకలో ఉన్న శ్రీకృష్ణుని చెల్లెలు సుభద్రను వివాహం చేసుకుంటాడు. ఇదే ఆ విజయుని విలాసం.

కథ ఇంద్రప్రస్థపురవర్ణనతో మొదలై, ధర్మనందనుని ధర్మ పరిపాలన, అర్జునుని గుణవిశేషాల వర్ణన. అటుతరువాత ద్వారక నుంచి శ్రీకృష్ణుడు పంపగా వచ్చిన గదుడనే యాదవుడు అక్కడి విశేషాలను చెబుతూ, సుభద్ర సౌందర్యాతిశయాన్ని వర్ణించడం ఇలా సాగిపోతుంది కథ.

పైన చెప్పిన పద్యం ఇంద్రప్రస్థపురవైభవాన్ని ప్రస్తుతిచేస్తున్న సందర్భంలోనిది. ప్రతిపద్య చమత్కృతికి పేరుబడ్డ విజయవిలాసంలో చక్కటి పద్యాన్ని ఎంచుకోవడం అంటే రాజుగారి ఖజానాలో రత్నాలకోసం వెదకడం వంటిది.

వస్తువర్ణనగాని, స్వభావ వర్ణన గాని, గుణ వర్ణన గాని, సంభాషణలు గాని - విషయం ఏదైనా శబ్ద చమత్కారాన్నో, అర్థ చమత్కారాన్నో చూపక మానడు ఈకవి. చెప్పిన ప్రతి సంగతిని ఒక పలుకుబడితోనో, నానుడితోనో సమర్థించడం కూడా చేమకూర కవికి అలవాటు. అంతేకాదు అలా చెప్పడం నల్లేరు మీద బండినడక అనిపిస్తాడు.

రాజసూయయాగాన్ని దిగ్విజయంగా చేసుకున్న ధర్మరాజుకి సంపదలకు, సౌభాగ్యాలకు కొదవేముంది. ''ద్వారక ముద్దుచేల్లెలట తన్నగరీ మణి'' అంటూ మొదలు పెట్టి, దీన్ని మించిన సృష్టిని చెయ్యడం వీలవకే కదా విశ్వకర్మ మరి ఆ ప్రయత్నాన్ని మానుకున్నాడు. అని సమర్థిస్తాడు. ఆ ఊరిలో ఉన్న చతుర్వర్ణాల వారు చదువుల్లోను, సాముల్లోను,ధనధాన్యల్లో, సంపదల్లోను తమకు సాటి ఎవరూ లేరన్నట్టు మసలుతారట. కందకాలు పాతాళాన్ని, మేడలు ఆకాశాన్ని అంటుతున్నాయట. ఆ ఊళ్ళో గుజ్జనగూళ్ళు ఆడుకునే అమ్మాయిలు చంద్రుడిలో ఉన్న కుందేలును పట్టుకుందామని అనుకుని, ఆటలసందడిలో మునిగిపోయి, దూరంగా వెళ్ళిపోయిన చంద్రుడిని చూసి, మహా ధీమాగా ''ఆ... వంటయింటి కుందేలు ఇదెక్కడికిపోతుంది రేపు చూడొచ్చులే" అనుకున్నారుట.

ఇలా వర్ణిస్తున్న సందర్భంలోనిది పైన చెప్పిన పద్యం. ఇందులో వర్ణించబడినవి ఇంద్రప్రస్థపురంలో ఉన్న మింటినంటిన బంగారు మేడలు. పద్యానికి అర్థం ఇది...

పున్నమినాడు రాత్రివేళ చంద్రుడు ఆ నగరం మీదుగా పోతున్నాడు. ఇలా పోతున్న ఆచంద్రుడికి ఎత్తైన ఆ ఊరి భవనాల అంచులు తగిలాయట. అప్పుడు ఆ నిండుచందమామ చిదిగి అందులో ఉన్న అమృతం కాస్తా జారి మేడలమీదికి దిగజారింది. మరి తనలో ఉన్న సుధారసాన్ని పోగొట్టుకున్న చంద్రుడు ఆ రోజునుంచి నెమ్మది నెమ్మదిగా సన్నగిల్లడం మొదలెట్టాడు. ఇది ఎవరైనా నిజం

కాదు, ఉత్తి మాటలు అన్నారనుకోండి. మరి పదహారువన్నెల బంగారంతో కట్టిన ఆ మేడలకి సౌధాలు అన్న పేరు రావడానికి కారణం ఏమిటి?

పై విధంగా ప్రశ్నించడమే చేమకూర గడుసుదనం. సంగతి ఏదైనా, సందర్భం ఏదైనా, చేమకూర మాత్రం తన చమత్కారాన్ని, శ్లేషని మాత్రం వదలిపెట్టడు. ఆ పట్టణంలో ఉన్నవి బంగారపు మేడలు. వాటిని జనం సౌధాలు అని ఎందుకంటారంటే, సుధాంశుడిలో ఉన్న సుధ(అమృతం) భవనాల అంచులు తాకి చిదిగి దిగజారి, వాటి మీద జారటం వలన.

"సౌధో స్త్రీ రాజసదనమ్". "సుధాయోగాత్ సౌధః." సుధ అనగా సున్నము; అదిగలది. రాజ్ఞామ్ సదనం రాజసదనమ్ - రాజులయొక్క గృహము. - అని అమరం.

సున్నం వేయబడ్డవి సౌధాలు. కాని సుధ అనే మాటకి అమృతం, వెన్నెల అనే అర్థాలు కూడా ఉన్నాయి.

ఇంద్రప్రస్థపురంలో ఉన్న మేడలు ఆకాశాన్ని అంటడం అన్నది అతిశయోక్తి. వాటిమీద సుధారసం జారిపడడం మరో అతిశయోక్తి. పౌర్ణిమ నాటి చంద్రుడు రోజురోజుకు క్షీణించడానికి ఆ మేడల ఔన్నత్యం కారణం అన్నది వీటన్నిటికి మించిన అతిశయోక్తి. అయితే వీటన్నైటిని "సౌధం" అన్న శబ్దంలో ఉన్న శ్లేషను ఆధారం చేసుకుని సమర్థించడం చేమకూర చాకచక్యం. ఈ ప్రతిభే ఆంధ్రసాహితీప్రపంచంలో మహాకవుల పక్కన అతనికి ఆసనం వేసి కూర్చోబెట్టింది.

సీ. కడుపులో  మెరుపులు కలవరించిన నిట్ట

మొయిలు వెల్గులు  వోని  పూలు కొన్ని

బంగారమును రాగి పాళ్లుగా కరగించు

వన్నెయై  యున్నట్టి  పండ్లు కొన్ని

కొన్ని పూవులు లేత జన్నియావు పొదుగు

వలె గర్భ మంథరోజ్వల మధువులు

కొన్ని పండ్లు ,రసానుకూల వాంఛా పరీ

పాక ముగ్ధాకార వర్తులములు

గీ. విడివిడిగ  మెట్ట పళ్ళిక చేర్చి ,శిరసు

పైన నిడుకొని ,మెల్లగా వచ్చె శబరి

తుట్ట తుద దాక ఎండిన చెట్టుకొమ్మ

శేఖరంబున యందు పుష్పించినట్లు.

- రామాయణ కల్పవృక్షం  - ఆరణ్యకాండ. ప.335

- నాకు నచ్చిన పై పద్యం శ్రీ విశ్వనాధసత్యనారాయణగారి శ్రీమద్రామాయణ కల్పవృక్షం లోనిది.

వెనుక తరాలవాళ్ళు తాపత్రయ పడి, ప్రశంసించడానికి బిరుదులు, విశేషణాలు ఏమీ మిగలకుండా తన జీవితకాలంలోనే బోలెడు బిరుదులు, సత్కారాలు, సన్మానాలు పొందడమే కాకుండా జ్ఞానపీఠాన్ని కూడా అలంకరించాడు విశ్వనాధ. తన ప్రతిభాపాండిత్యాలతో ఆయన సుసంపన్నం చెయ్యని ప్రక్రియ అంటూ లేదు. ఆధునిక ఆంధ్రసాహిత్య ప్రపంచంలో మలుపురాళ్ళుగా నిలిచి పోయిన మహనీయులు లేకపోలేదు. కాని అటు ప్రాచీన ధోరణిలోను, ఇటు కొత్తపోకడలలోను "సెబాస్" అనిపించుకుని రెండు వైపులా తనదైన ముద్రతో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నవాడు ఒక్క కవిసామ్రాట్ మాత్రమే.

పైపద్యం అరణ్యకాండలో శబరి వర్ణన. శబరికధ మనకందరికీ తెలిసినదే. సీతను వెతుక్కుంటూ ప్రయాణం చేస్తున్న రాముడికి తన ఎంగిలిపళ్ళు పెట్టిన అవ్వ ఈవిడ. మతంగముని శిష్యురాలు. కాలం తీరిన ఆ ముని స్వర్గానికి వెడుతూ, "చిత్రకూటం చేరిన శ్రీరాముడు ఇటుకేసి వస్తున్నాడు" అని శిష్యురాలికి చెప్పివెడతాడు. అప్పటి నుండి రాముని రాకకై ఎదురుచూస్తుంటుంది శబరి. రామడిని తనివితీరా చూసి, సేవించుకున్న తరువాత "నా సేవలు, సహాయం లేక స్వర్గంలో గౌతమ ముని అల్లాడి పోతాడు" అంటూ అగ్నిప్రవేశం చేసి తన గురువును చేరుకుంటుంది. పాత్ర చిత్రణకి పెట్టింది పేరైన విశ్వనాధ వారు శబరిని చమత్కారిగాను, భక్తురాలిగాను, జ్ఞానిగాను అత్యద్భుతంగా చిత్రించారు. శబరికథా సందర్భం చాలా మటుకు సంభాషణ రూపంలో ఉన్నా ఈ ఒక్క పద్యం మాత్రం శబరిని రూపాన్ని ఒక అద్భుతమైన ఛాయాచిత్రం గా చూపిస్తుంది.

అరణ్యమార్గాన నడుస్తున్న రామలక్ష్మణులు అది శబరిఆశ్రమ ప్రాంతంగా గుర్తుపడతారు. పంపానదీ తరంగాల మీదుగా చల్లని పిల్లగాలులు తగులుతుండగా రాముడు శబరిని చూడాలని అనిపిస్తోంది అంటాడు. రాముడు ఇలా అంటుండగా ప్రవేశించిన శబరి వర్ణన ఈ పద్యం.

ఈ సీస పద్యంలోని నాలుగు పాదాలు, ఎత్తుగీతిలోని మొదటి రెండు పాదాల అర్థం ఇది....

కడుపులో మెరుపులు కదులుతున్న మేఘంలాగ మెరిసిపోయే పూలు కొన్ని, బంగారము, రాగి కరిగించి కలిపి వన్నె పెడితే వచ్చే పచ్చని రంగులో వెలిగిపోతున్న పళ్ళు కొన్ని , మంచి ఆవుపొదుగు వంటి తమ గర్భాల్లో మధువులు దాచుకున్న పూలు కొన్ని, మధుర రసాలతో నిండి చక్కగా గుండ్రంగా ఉన్న పళ్ళు కొన్ని - వీటిని సేకరించి, ఒక లోతుగా లేని బుట్టలో విడి విడిగా బాగా కనబడేటట్టు పేర్చి, ఆ బుట్టని తలమీద ఉంచుకుని నెమ్మదిగా వచ్చింది శబరి.

ఎత్తుగీతిలోని తక్కిన రెండు పాదాల గురించి తరవాత చెప్పుకుందాం. - మబ్బులో కదులుతున్న మెరుపులు వెలుగు బయటికి చిమ్ముతున్నట్టుగా పువ్వులు తమ సౌందర్యాన్ని విరజిమ్మడం, మేరుగుపెట్టిన రాగి,బంగారు వర్ణాలు కలిసినట్టు పళ్ళు వెలిగిపోవడం, తమలో దాచుకున్న మకరందాలతో విల్లివిరుస్తున్న పుష్పాలు, రసభారితాలై నోరూరించే ఫలాలు – ఇవన్నీ అందరు చేసే వర్ణనలే ప్రత్యేకత ఏవుంది? పోనీ తరవాత ఏముందో చూద్దాం. ఈ పళ్ళు పువ్వులు ఒక బుట్టలో మామూలు బుట్టకాదు ఒక మెట్ట పళ్ళికలో(అంటే లోతు తక్కువ ఉన్న బుట్టలో) విడి విడిగా పేర్చింది. బాగా కనబడటానికి, ఒక దానిమీద ఒకటి పడి నలిగిపోకుండా ఉండటానికి అన్న మాట. మెల్లగా వచ్చింది. ఎందుకంటే వృద్ధురాలు కాబట్టి. ఇందులో మాత్రం గోప్పేవుంది అంటారా ... అయితే ఇంకొంచం ముందుకు వెడదాం....

ఇలా వస్తున్న శబరిని ‘‘తుట్ట తుద దాక ఎండిన చెట్టుకొమ్మ శేఖరంబున యందు పుష్పించినట్లు ‘‘ అని పోల్చటంలోనే ఉంది కవి ప్రతిభ. వృద్ధాప్యంతో కృశించిన శరీరం ఎండుకట్టె లాగ ఉందనడం అతిసహజం అయిన ఉపమానం. ఆమె తలమీద ఉన్నరంగురంగుల పూవులు, పళ్ళు ఆ ఎండిన చెట్టుకి చిటారు కొమ్మన పూసిన పువులుగా కనబటటం సహజమే కాదు, అత్యద్భుతం కూడా. మనసులో మెదిలిన బొమ్మని కళ్ళెదుట కనబడేలాగ చేసేదే కవిలో నిత్యనూతనంగా వెలిగే ప్రతిభ.

గర్భితంగా ఉన్న అర్ధం చూస్తే, ముసలితనంతో కృశించి పోయింది శరీరం. మరి ఆలోచనకి, మేధకి చోటైన తల మాత్రం రాముడి చింతనతో, వెలుగులు చిమ్మడం, రసభరితంగా ఉండడం మరింత సమంజసం. చూపుని దాటి, పాఠకుడి మనోవీధిలో స్ఫుర్తి కలిగించేది కవి యొక్క ప్రజ్ఞ.

మూలంలోని చిన్న సూచనని ఆధారం చేసుకుని సుందరశిల్పంగా తీర్చి దిద్దిబడిన జ్ఞానశబరి విశ్వనాధవారి ‘‘శబరి’’ గా నిలబడి పోయింది. ఈ పాత్రని గురించి పండితులు బోలెడంతగా విశ్లేషించారు. కాని ఈ పద్యంలోని చివరి రెండు పాదాలు చాలు విశ్వనాధవారి శబరిబొమ్మ ఎప్పటికి మనసులో ఉండిపోవటానికి. అని నాకు అనిపిస్తుంది.

శా. కైలాసం బగజేశులం గొలువరాఁ గా భక్తితో దేవతా

శైలంబు జనుదెంచెఁ గూడి, ధనదాశంబుట్టి జోడై యమా

శాలీలాగమనంబునన్ శశి దినస్వాముల్ వియద్వీథి రాఁ

గాలంబిట్లగుటేలొకో ? యనుచు లోకం బద్భుతం బందఁగన్

- శ్రీ కాళహస్తిమాహాత్మ్యము. ప్రథమాశ్వాసము. పద్యం. 94

ఇది అతులితమాధురీమహిమతో ధూర్జటి మహాకవి వ్రాసిన "శ్రీ కాళహస్తిమాహాత్మ్యం" లోనిది. తనకు పూర్వం చాలామంది కవులలాగానే ధూర్జటి స్థలపురాణాన్నికావ్యవస్తువుగా తీసుకున్నాడు. పరమశివభక్తుడైన ఈ కవి ఐదుపద్యాలలో దైవస్తుతి చేసి, మరో అయిదుపద్యాలలో తన కావ్యకన్యామణికి, ఆ పినాక పాణియే తగిన వరుడని నిర్ణయించి, మరో ఐదు పద్యాలలో షష్ఠ్యంతాలు ముగించి ప్రబంధాన్ని ప్రారంభించాడు. నేనెవరో నాప్రతిభ ఏమిటో కావ్యం చదివిన వాళ్ళకి చెప్పకుండానే తెలుస్తుందన్నట్లుగా ముక్తసరిగా ముగించాడు ఉపోద్ఘాతాన్ని. మన తెలుగు కావ్యాలలో, ప్రబంధాలలో ఇటువంటి అతిసామాన్యమైన ఆరంభం చాలా అరుదైన విషయం.

ఈ స్థలపురాణంలో కాళహస్తీశ్వరుడుని కొలిచి ధన్యులయిన వసిష్ఠుడు,సాలె పురుగు, ఏనుగు,పాము,తిన్నడు ఆదిగాగల పదిమంది భక్తుల కధలున్నాయి. తక్కిన గ్రంధాలలో వలె ఏ సూతుడో,మరే మహాముని, శ్రోతలకి వినిపించి నట్టుగా కాకుండా, ఆ పరమశివుడే స్వయానా యాదవరాజుకి చెప్పినట్టుగా వ్రాయడం మరో విశేషం.

కాళహస్తీపురంలో ఉండే ఒక దాసి, మాయాజంగమ రూపంలో తన ఇంటికి వేంచేసిన శివుడిసాంగత్యంలో సర్వం మరిచింది. తన సేవకు రాని దాసిమీద ఆగ్రహించి, ఆమె తల గొరిగించాడు ప్రభువు. ఈశ్వరకటాక్షం వల్ల శిరోజాలను తిరిగిపొందిన దాసిని చూసి

రాజు ఆశ్చర్యపోయాడు. మహిమాన్వితుడైన ఆ జంగమదేవుని దర్శనార్థం బయలుదేరాడు. అలా వచ్చిన రాజుని "కాళహస్తీశ్వరునికి ఆలయం కట్టించమని" ఆదేశించాడు శివుడు. యాదవరాజు దానికి అంగీకరించి, కాళహస్తి స్థలచరిత్రని వినిపించవలసిందిగా విన్నవించుకుంటాడు. అప్పుడు ఆ రాజుకి రజతాచలేశ్వరుడు స్వయంగా చెప్పిన కథారాజలివి.

వాటిలో మొదటిది వశిష్ఠుడి వృత్తాంతం. మహాతపోధనుడు, బ్రహ్మర్షి అయిన వశిష్ఠుని వంటివాడు కూడా సంసారపు మాయలో చిక్కుకున్నాడంటే పామరుడిలాగే ప్రవర్తిస్తాడు అనడానికి ఇదో నిదర్శనం. ఒకప్పుడు విశ్వామిత్రుని కారణంగా తన వందమందిపుత్రులను కోల్పోయిన వసిష్ఠుడు దుఃఖంతో వివశుడై, వెర్రివాడిలా తిరుగుతూ, ఒక కొండకొమ్ము నుండి దూకి ఆత్మహత్య చేసుకోబోతాడు. అప్పుడు భూదేవి వసిష్ఠుడిని తన అరచేత్తో బంతిని పట్టుకున్నట్టు పట్టుకుని కాపాడింది. అంతేకాదు .."దుఃఖవిముక్తికి ఇదేం ఉపాయమయ్యా ! ఈ శరీరం కాకపోతే మరో శరీరం వస్తుంది. అప్పుడు మళ్ళీ శోకం తప్పదు. కాబట్టి ఆ పార్వతీరమణుని మీద మనసు లగ్నం చేసి తపస్సు ఆచరించి కైవల్యం పొందు" అని బోధించింది. సరేనని తపమారంభించాడు ఆ ఋషీశ్వరుడు. వశిష్ఠుని అచంచలమైన తపోదీక్షకు మెచ్చి ప్రత్యక్షమైన శివుడు "నీకు ఏం వరం కావాలో కోరుకో " అన్నాడు. అప్పుడా వసిష్ఠుడు " స్వామీ! నువ్వు ఈ పర్వతప్రాంతంలో నివసించి నాపూజలు గ్రహించు. నాకు జ్ఞానభిక్ష పెట్టు" అని ప్రార్థించాడు. దానికా భోళాశంకరుడు "తథాస్తు" అని పలికాడు.

కథ ఇంతటితో ఎలా ఆగి పోతుంది? ఎంత ఏనుగు తోలుకట్టినా, విభూతి పెట్టినా ఈ జంగమదేవరకి కూడా ఇల్లాలు,ఇల్లు, వంది(నంది)మాగధులు,సేవా(ప్రమథ)గణాలు అన్నీ ఉన్నాయిగా మరి. ముందుగా భార్యామణి దేహంలో సగమైన ఆవిడకి తప్పదు కదా మరి, ఈ కాళహస్తిపురానికి బయలుదేరి వచ్చి జ్ఞానప్రసూనాంబ అయింది. జననీజనకులని వదలి నేనుండలేను అనుకుంటూ, ఆ కైలాస పర్వతం కూడా కదలి రావడం మొదలు పెట్టింది. ఆ సందర్భంలో నిది పై పద్యం. పద్యానికి అర్థం ఇది.

అగజేశులం గొలువ కైలాసంబు రాౕ గా = గిరిజను,ఈశ్వరుడిని సేవించుకోవడానికి కైలాస పర్వతం వస్తుండగా

భక్తితో దేవతా శైలంబు జనుదెంచెౕ గూడి = దేవతలకు నివాసమైన ఆ మేరుపర్వతం భక్తితో ఆ కైలాసంతో కలిసి రావడం మొదలెట్టింది..

శశి దినస్వాముల్ జోడై = చంద్రుడు, సూర్యుడు జంటగా కలిసి

ధనాత్ ఆశన్ పుట్టి = ఉత్తర దిక్కున పుట్టి /ఉదయించి

యమ ఆశ = దక్షిణ దిక్కుకు

వియద్వీథి = ఆకాశ మార్గంలో

లీలాగమనంబునన్ రా = లీలాగమనంతో రాగా

కాలంబిట్లగుట ఏలొకో? = కాలగమనం ఇలా మారింది ఏమిటా?

అనుచు లోకంబు అద్భుతంబు అందగన్ = అంటూ లోకం ఆశ్చర్యపోగా

కైలాస పర్వతం హిమాలయాల్లో ఉండే మంచుకొండ తెల్లనిది. దేవతానిలయం అయిన మేరుపర్వతం బంగారు కొండగా ప్రసిద్ధికెక్కిన ఇదేమో పసిడి కాంతులతో నిండినది. ఇవి రెండు ఉత్తరదిశను ఉంటాయి అని ప్రతీతి. తన జననీజనకులైన పార్వతీపరమేశ్వరులని వదిలి ఉండలేక తెల్లటి మంచుకొండ, ఆ ఆదిదంపతులున్న కాళహస్తి క్షేత్రానికి, దక్షిణదిశగా ప్రయాణం కట్టింది. దాన్ని చూసి భక్తిభావంతో, త్రిపురాసుర సంహార సందర్భంలో ఆయన చేత ధనువైనది, సకలదేవతానిలయమైనది అయిన మేరుపర్వతం కూడా దానితోబాటు సదాశివుడున్న చోటుకి కదిలింది. వీళ్ళ ప్రయాణం ఎక్కడ జరుగుతోంది?"వియద్వీధి" అంటే ఆకాశమార్గంలో. తెలుపు,ఎరుపు రంగుల్లో ప్రకాశిస్తున్న ఈ రెండుకొండలు వినువీధిలో ఉత్తరాన బయలు దేరి, దక్షిణ దిశగా రావడం చూసి ... ఇదెంత విచిత్రం అయిన విషయం? తూర్పున ఉదయించి పడమటకి వెళ్ళ వలసిన చంద్రుడు, సూర్యుడు ఇలా ఉత్తరాన పుట్టి దక్షిణానికి వస్తున్నారేమిటి? కాలగమనం ఇలా మారిందేమిటి ? అంటూ లోకం అద్భుతాశ్చర్యాలలో మునిగిందట.

నవనవోన్మేషప్రతిభాశాలి యైన కవి ఐంద్రజాలికుడిలా మన మనసులకు రెక్కలు కట్టి విహంగాల వలె విహరింప చెయ్యగలడు అన్నది మనకి అనుభవైకవేద్యమైనదే. కాని ఇంద్రుడు కొట్టివేసిన రెక్కలను మళ్ళీ మొలిపించి, ఈ పర్వతరాజాలనిద్దరిని ఆ రాజశేఖరుని సన్నిధికి ప్రయాణింపజేయ గలిగిన ఈ కవి ప్రతిభకు జోహార్లు పెట్టక తప్పదు మరి.

----------------------

సాహితీసమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు మహాకవులని,పండిత శ్రేష్ఠులని, పోషించడమే కాకుండా,స్వయంగా సంస్కృతాంధ్రాలలో కావ్యరచనావ్యాసంగం సాగించిన కోవిదుడు. తన సామ్రాజ్యాన్ని సంపదలకు కాణాచిగాను, కళామతల్లికి కొలువుకూటంగాను చేశాడు. నిరాటంకంగా దిగ్విజయయాత్రలు సాగించి విజయపతాకలు ఎగురవేశాడు. వీటన్నింటికి మించి ఈ కన్నడరాయడు "దేశభాషలందు తెలుగు లెస్స" అనే పతాకను తెలుగుజాతి చేత ఉంచాడు. ఈ నాటికీ తెలుగువాడు దాన్ని పట్టుకుని, తలెత్తుకుని సాగిపోతూనే ఉన్నాడు.

తెలుగు వల్లభుడైన ఆంధ్రవిష్ణువు, ఆంధ్రభోజుడైన రాయలకు కల్లో కనబడి, "మధురకావ్యరచన మెప్పించికొంటివి గీర్వాణభాష, ఆంద్రభాష అసాధ్యంబె?" అని పొగిడి" తాను ధరించిన పూలమాలని దేవునికిచ్చిన చిన్నది శ్రీరంగంలో ఆరంగేశుని వివాహమాడిన కథ కావ్యంగా వ్రాసి, అంకితం ఇచ్చి, "మాకు ప్రీతి కలిగించు" అని అడిగి మరీ వ్రాయించుకున్నాడు. అదే తెలుగు పంచకావ్యాల్లో ఒకటిగా గణింపబడే "ఆముక్తమాల్యద". ప్రౌఢమైన భాషా, ప్రౌఢతరమైన శైలి , ఈ రెండు కలిసి, ఆముక్తమాల్యద పండితులకి మాత్రం అందుబాటులో ఉండే మహాకావ్యంగా ఖ్యాతిని తీసుకువచ్చాయి. నారికేళపాకభరితమని ప్రఖ్యాతి గడించుకున్న ఈ కావ్యరాజంలో ఆ కాఠిన్యాన్ని కష్టపడి దాటితే అద్భుతమైన పదప్రయోగం, అపూర్వమైన వర్ణనలు కోకొల్లలుగా కనబడి అబ్బురపాటుని కలిగిస్తాయి.

ఇప్పుడు మనం మాట్లాడుకోబోయే పద్యం ఆముక్తమాల్యద ద్వితీయాశ్వాసం లోనిది.

మ. **అతివృష్టి న్మును వార్ధిఁ గూర్చు నెడకాఁడౌటం దముం గూర్చున**
**న్మతి లంచంబుగ హేమటంకములు మింటం బొల్చుపర్జన్య దే**
**వత కీ నెత్తిన కేలునాఁ బొలిచె నిర్వారి స్రవంతి న్బయ**
**శ్చ్యుతి నమ్రచ్ఛద దృశ్యకర్ణికములై యున్నాళనాళీకముల్**

- ఆముక్తమాల్యద ద్వితీయాశ్వాసం. పద్యం 52

ఇందులో వస్తువు గ్రీష్మ ఋతువర్ణన. ద్వితీయాశ్వాసం మధురాపురి వర్ణనతో ప్రారంభం అవుతుంది. ఈ కావ్యంలో వస్తువు కాస్త అస్తవ్యస్తంగా ఉండటం చేత అన్వయం మనమే చెప్పుకోవాలి. ప్రధమాశ్వాసంలో విలుపుత్తూరు, అందులో ఉండే విష్ణుచిత్తుని జీవితవిధానం చెప్పబడుతుంది. తరువాతి కథ ఆ విష్ణుచిత్తుడు మధురకు రావడం. కనుక దానికి పూర్వరంగంగా, ద్వితీయాశ్వాసం మధురా పట్టణం వర్ణనతో ఆరంభం. తరువాత మత్స్యధ్వజుడి వైభవం యొక్క ప్రసక్తి. అటు తరువాత రావాల్సింది వేసవికాలం. అప్పుడే మధురలో తెప్పతిరనాళ్ళు జరగడం, పరదేశీయులు దాన్ని చూడడానికి రావడం జరుగుతుంది. ఇలా వచ్చిన ఒక పరదేశి ఒక బ్రాహ్మణుని ఇంటభోజనం చేసి వీధి అరుగుమీద పడుకుంటాడు. ఎందుకంటే మరి వేసవికాలం కనుక. అప్పుడు అతడు పాడిన ఆర్యగీతం ఆ దారిన పోతున్న రాజుగారి చెవిన పడి వైరాగ్యం కలగాలి. అప్పుడు ఆరాజు యొక్క కొలువులో మోక్షవిద్యపై చర్చలు జరగాలి. దానికి విష్ణుచిత్తుడు రావాలి. విశిష్టాద్వైతమతాన్ని పాండ్యరాజు సభలో ప్రతిపాదించాలి అదీ కథ. కనుక ద్వితీయాశ్వాసంలో సుదీర్ఘమైన గ్రీష్మఋతు వర్ణన జరుగుతుంది.

రాయల కావ్యంలో అన్నీ నిడివిగల వర్ణనలే. ఎంత దూరంవర్ణించుకుంటూ పోయినా, తన వర్ణనా చాతుర్యంతోనూ, కల్పనా శక్తితోను, పాఠకుడిని మాత్రం (ఆ) కట్టుకుని మరీ తీసికెళ్ళ గల ప్రతిభాశాలి ఈ కవి. ఈ పద్యానికి అర్ధం ఇది....

ముని అతివృష్టిన్ వార్ధిన్ కుర్చు ఎడకాదు ఔటన్ = ఇంతకు పూర్వం/గతంలో వానలు మిక్కిలిగా కురిపించి, తమను ఆ సముద్రునితో కలిపేవాడు/ సంధికూర్చేవాడు కావడం చేత

తమున్ కూర్చున్ అను మతిన్ = తమ్ము మరల కలుపుతాడు అన్న ఆలోచనతో

మింటన్ పొల్చు పర్జన్యదేవతకున్ = ఆకాశంలో ఉండే ఆ పర్జన్యదేవతకు

లంచంబుగన్ హేమటంకములు ఈన్ ఎత్తినకేలు అనాన్ = బంగారు నాణాలు లంచంగా ఇవ్వడానికి ఎత్తి పట్టుకున్న చెయ్యేమో అన్నట్టుగా

నిర్వారిస్రవంతిన్ = నీళ్ళు లేక(ఎండిపోయిన) ఏటిలో

ఉన్నాళ నాళీకముల --- ఉత్ = పైకి లేచిన, నాళ = తుండ్లు కలవైన , నాళీకముల్ = తామరలు

పయః చ్యుతిన్ = నీరు అంతా జారిపోవడం వల్ల, నమ్ర = వ్రాలిన, ఛద = రేకులుకలవై, దృశ్య = అగుపడుతున్న

కర్ణికములు ఐ = దుద్దులుకలవియై (పుష్పం యొక్క నడిమిభాగం), పొలిచెన్ = వెలుగుచున్నది.

వర్షాకాలంలో నదులు, ఏర్లు నిండి పారుతూ సముద్రుని చేరుకుంటాయి. ఈ విధంగా పర్జన్యుడు ఏర్లకు సముద్రానికి సందానాన్ని ఏర్పాటుచేస్తున్నాడు. మరి వేసవిలో నీరులేక ఏరు పారడం లేదు. అందులో ఉన్న తామరలు ఎండి, వాడిన రేకులు, వాలిపోయి ఉన్నాయి. తామరకి బొద్దున ఉన్న దుద్దులు, వాటి సహజవర్ణం అయిన పసుపురంగులో స్పష్టంగా పైకి కనబడుతున్నాయి. ఇదంతా ఎలా ఉంది అంటే .. వర్షఋతువులో అధికంగా వర్షాలను కురిపించి తమని సముద్రుడితో కలిపేవాడైన ఆపర్జన్యుడిని మళ్ళీ తమకి సహాయం చెయ్యమని అడుగుతున్నాయి ఆ ఏర్లు. దానికి లంచం కూడా పెడుతున్నాయి. ఏటిలో

ఎండిపోయి వాలిఉన్న తామర పూలరేకులు చేతివేళ్ళను తలపిస్తున్నాయి. వాటి నట్టనడుమ ఉన్న దుద్దులు పచ్చరంగులో కనబడుతున్నాయి. ఇలా ఆ ఏరు వేళ్ళని బాగా కిందికి జార్చి,(అంటే అరచెయ్యి బాగా కనిపించేటట్టు) చెయ్యి పైకెత్తి అరచేత ఉన్న బంగారు నాణాలని పర్జన్యుడికి లంచంగా చూపెడుతున్నదా అన్నట్టున్నదట?

ఎంత అద్భుతమైన ఊహ. నిజంగానే... మరి ఇది ఉత్ప్రేక్షాలంకారం కదా! తన ఊహ అనే కుంచె విసిరిన రంగులతో ఏటిలో వాడి రేకులు రాలిపోవడానికి సిద్ధంగా ఉన్న పువ్వుని మరపురాని చిత్రపటంగా మన ఎదుట నిలుపగలిగిన రాయల ప్రతిభ నిస్సందేహంగా అప్రతిమానం. ఈ రాజు చూడనిది, విననిది, జ్ఞాపకాల పొరలలో పదిల పరచుకోనిది అంటూ ఏదైనా ఉందా అనిపిస్తుంది. చెరువులో బ్రాహ్మణులు స్నానం చేసి మడిచి చుట్టిన తడి పంచెలు, ద్రవిడ స్త్రీలు స్నానంచేస్తున్నప్పుడు పూసుకున్న పసుపునీళ్ళలో తడిసి బంగారు రెక్కలతో ఈదుతున్న బాతులు, జొన్నలు తినవచ్చిన పక్షులని కలువమాలలతో తోలుతున్న రైతువనితలు, మేడమీద నిలబడ్డ జవరాలు శిరోజాలను విప్పి, వాటిలోనుంచి వాడిన మల్లెపూలని గోళ్ళతో మీటే తీరు - ఈ రాయలు చూశాడు అందరికి చూపించాడు. ఆయనది స్వర్ణయుగం. ఆయన పట్టుకున్నదంతా బంగారం. ముట్టుకున్నవన్నీ మాణిక్యాలు. బజారువీధులలో ముత్యాలు, రత్నాలు కుప్పలుగా పోసి అమ్మించ గలిగిన సార్వభౌముడు, వాడిపోయిన పూలలో సహితం బంగారాన్ని చూడడంలో వింతేముంది.

ఒక కవి తరతరాలుగా చదువరుల హృదయంలో చోటు చేసుకోవడానికి ఎన్ని గొప్ప రచనలు చేశాడని లెక్క పెట్టనక్కర్లేదు. కొంతమంది విషయంలో ఒక్క రచన చాలు సారస్వతప్రపంచంలో కలకాలం గణనీయమైన స్థానంలో నిలిచిపోవడానికి. అలాంటి మరుపురాని కవుల్లో నంది తిమ్మన ఒకడు. ''పారిజాతాపహరణం'' నిజంగా తిమ్మన ఆ సాహితీసరస్వతికి అర్పించిన పారిజాతమే అయింది.

పారిజాతాపహరణంలో నీకు నచ్చిన పద్యం ఏది అని నన్నేకాదు ఎవరిని అడిగినా వరసపెట్టి ఒక వంద పద్యాలు చెప్పవలసి వస్తుంది. కాని ప్రస్తుతానికి

**చ. వనిత కుచద్వయంబుపయి వ్రాసిన కుంకుమపత్త్రభంగము**
**ల్జనితనితాంత ఘర్మకణజాలముచేతఁ గరంగి మెల్ల మె**
**ల్లన వెలిపట్టు పయ్యెద కెలంకుల జారుట యొప్పె మానసం**
**బున నెలకొన్న క్రోధరసము న్వడఁ బెట్టుచునున్న కైవడిన్**

అన్న పద్యం గురించి మాట్లాడుకుందాం. నందితిమ్మన పద్యం నచ్చకపోవడం అంటూ ఉంటుందా? తిమ్మన పద్యం మాధుర్యానికి మారుపేరు.

పైపద్యానికి సందర్భం ఇది. ద్వారకానగరంలో ఎనిమిది మంది పట్టమహిషులు, మరో పదహారువేల మంది అందకత్తెలు భార్యలుగా శ్రీకృష్ణుడు అలరారుతుండగా, ఒక నాడు నారదుడు రుక్మిణీ మందిరాన వున్న ఆ యదుకుల నందనుడి వద్దకి రావడం జరిగింది. నారదుడు కృష్ణుడిని దర్శించుకుని, తాను స్వర్గం నుంచి తెచ్చిన ''పారిజాతం'' అనే దివ్యకుసుమాన్ని ఆయనకు సమర్పించుకున్నాడు. దాన్ని ఎవరికిస్తే బాగుంటుంది? అంటూ తర్జన భర్జనలు చేసినట్టుగా నటించి, రుక్మిణికి ఆ పువ్వునిస్తాడు

కృష్ణుడు. అప్పుడు నారదుడు ఆ రుక్మిణీదేవిని ఎడాపెడా పొగిడేస్తాడు. మరి అక్కడే ఉన్న సత్యభామ చెలికత్తె పరుగున వెళ్ళి , పొల్లు పోకుండానే కాదు, కొన్ని దీర్ఘాలు, రాగాలు కూడా జతపరిచి తమ యజమానురాలికి తాజా వార్తని చేరవేస్తుంది.

దాంతో సత్యభామాదేవి తోకతొక్కిన త్రాచులా, ఆజ్యం పోస్తే భగ్గున లేచిన మంటాలా, కోపంతో చివ్వున లేచి, జరిగిన సంఘటనని విశ్లేషించి, చివరికి తప్పంతా ధూర్తగోపాలుడిదే అంటూ, మాసిన చీరచుట్టుకుని పుట్టలోకి వెళుతున్న పాములా కోపగృహంలోకి ప్రవేశించింది. అంటే సమీపించ బోయే వాళ్ళ కి భయం పుట్టేటట్టుగా.....

కొంతసేపటికి, కృష్ణుడు చెలికత్తె మాటలు విన్న సత్యకు కోపం వచ్చి ఉంటుందని ఖండితంగా తెలిసినవాడు కనుక, చింతాయుత్తచిత్తుడై ఆమె మందిరానికి చేరుకుంటాడు.

కోపగృహంలో ప్రవేశించి, ఏమీ ఎరుగని వాడిలా నటిస్తూ ఒక చెలికత్తె చేతనున్న తాలవృంతాన్ని తాను పుచ్చుకుని విసరటం మొదలు పెడతాడు.

శ్రీకృష్ణుడు తనతో బాటు మోసుకొచ్చిన పారిజాతపుష్పం తాలూకు దివ్యసుగంధం ముసుగు పెట్టుకుని పడుక్కున్న సత్యభామకి నాసాపుటాలను సోకింది. ఈ వినూత్న పరిమళం ఏమిటా అని, ముసుగు తొలగించి నలుదిక్కులా చూసింది. ఎదురుగా కనబడ్డాడు విసన కర్ర పట్టుకున్న దోషి , విభుడు. ఉక్రోషంతో, దుఃఖంతో వస్తున్న కన్నీళ్ళు కృష్ణుని కంటబడకుండా మళ్ళీ ముసుగువేసింది. ఇక్కడ తన పట్ల అపరాధం చేసిన భర్త కి చూపించాల్సింది తన కోపమే గాని, కన్నీళ్ళు కాదు. అందుకే ముసుగు పెట్టటం. కన్నీళ్ళ ని ఆపుకుని, వేడి నిట్టూర్పును వదలితే, ఆ గాలికి కప్పుకున్న ఆమె ముసుగు పైకి లేచింది.

ఆ సందర్భంలోనిది పై పద్యం. ఆధునిక యుగంలో భాగ్యవంతులైన ఆడవాళ్ళు " పాంపరింగ్ " కోసం " స్పా" లకి వెళుతున్నారు. ఆ రోజుల్లో కలిగిన వాళ్ళ కి ఆ సేవలన్నీ ఇళ్ళల్లోనే జరుగుతుండేవి. వాళ్ళ అలంకరణలో కుంకుమపత్ర రసంతో వంటి మీద "డెజైన్లు" వేయించుకోవడం ఒకటి. ఇది విని (చదివి) మనం ఎవ్వరం బుగ్గలు నొక్కుకోనక్కర్లేదు. నిజానికి ఈ నాడు అందానికి మెరుగులు పెట్టుకునే పేరుతో వంటిమీద పూయించుకునే బురద పూతలు, ముఖాలకు పట్టించుకునే నూరిన గడ్డి పూతలతో పోలిస్తే ఇవి అంత విడ్డూరంగా ఏమీ కనబడవు.

“వనిత కుచద్వయంబుపయి వ్రాసిన కుంకుమపత్రభంగములు” - సత్య వక్షస్థలం మీద రచింపబడిన ఈ ముద్రలు (కుంకుమపత్ర రచనలు) “జనిత నితాంత ఘర్మ కణజాలములు” అంటే ఒకటి రెండు చెమటబిందువులు కాదు, అత్యధికంగా పుట్టుకొస్తున్న స్వేదబిందువుల వల్ల కరిగిపోయి ఆఎర్రటిరంగు, "మెల్ల మెల్లన జారి" నెమ్మదిగా జారుతూ, "వెలిపట్టు పయ్యెద కెలంకుల జారుట" ఆవిడ కట్టుకున్న తెల్లటి పట్టుచీర కొంగుమడతల నుండి జారి బయటికి వస్తున్నదట. ఇది ఎలా ఉందంటే ......

"మానసంబున నెలకొన్న" మనసులో ఉన్న "క్రోధరసమున్" కోపం అన్న రసాన్ని(ద్రవాన్ని) "వడబెట్టుచునున్న కైవడిన్" వడపోస్తున్నట్టు, "ఒప్పెన్" చక్కగా నప్పినట్టు ఉంది.

ఇది ఒక అత్యద్భుతమైన ఉపమాలంకారం. ఇక్కడ కవి వర్ణిస్తున్నది ఒక్క చిత్రాన్నే కాదు, దాని వెనుక ఉన్న పాత్రని, ఆ పాత్ర పుట్టుపూర్వోత్తరలని, స్వభావాన్ని అన్నిటిని తాను తూచి,తూచి ఎంపిక చేసిన పదజాలంతో చెప్పక చెపుతున్నాడు.

లోకంలో సాధారణంగా ఏదైన ద్రవ పదార్థాన్ని తేటగా, స్వచ్ఛంగా చెయ్యాలంటే, తెల్లటి బట్టతో వడకట్టటం అన్నది అలవాటు. మరి కృష్ణునిపై తనకు కలిగిన అసలైన, సిసలైన కోపం బయటికి రావాలంటే సత్యభామ చెయ్యవలసిన పని కూడా అదే కదా! ఎటొచ్చీ ఆమె శ్రమ ఏమీ లేకుండానే, కోపం కూడా ఆవిడకి భయపడి కాబోలు బయటికి వచ్చేముందు శుభ్రపడి మరీ వస్తోంది.

అసలీ సత్యభామ ఎవరు? సముదంచిత కాంచన సౌధవీధిలో నివసించే మానవతి యైన మానిని, సౌందర్యాతిశయసంపన్నురాలు, "తను పనిచిన పంపుచేయుట ప్రాభవమని" భావించే భర్త గలది. రుక్మిణివలె ఈ కన్యకారత్నము "వరునన్వేషించలేదు". "విన్నపాలు చేసుకోలేదు". లోక మర్యాదననుసరించి తండ్రిచే కన్యాదాన మొసగబడి, శ్రీకృష్ణుని రాణియైన రాచకన్య ఈ సాత్రాజితి. అపురూపమైన, అమూల్యమైన శమంతకరత్నంతో ద్వారకలోకి అడుగుపెట్టిన మహనీయ సౌభాగ్యవతి. ఇలా ఆభిజాత్యము, అందము, అలవిగాని సంపద తన సొంతమైన నారీమణి. తాను మేలైన జాతి రత్నం కాబట్టి. ఆమె ప్రపంచంలో అన్నీ మేలైనవి, స్వచ్ఛమైనవి అయివుండాలి. మరి ఆమె కోపం మాత్రం తక్కువ తిన్నదా? అదీ స్వచ్ఛంగానే ఉండాలి. అదీ రాచ ఠీవితోనే కదలాలి మరి.

ఇక్కడ ఆ కుంకుమపత్ర రచనలు, చెమటకు కరిగి, తెల్లటి పట్టుచీర మడతలలో నుండి ఎర్రగా బయిటికి వస్తుంటే, ఆ కోపరసాన్ని వడపోస్తున్నట్టుగా ఉందనడం ఎంత అద్భుతమైన ఊహ. ఈవిధంగా తాను ఎంచుకున్న ఉపమతో, కనబడేవి, కనబడనివి కూడా అవలీలగా కళ్ళ ముందు ప్రత్యక్షం చెయ్యగలిగిన, లలితలావణ్య రచనాపాటవమే తిమ్మనని మరపురాని మధురకవిగా చేసింది.

**ఉ. ఎంత తపంబు సేసి జనియించినవా రొకొ మర్త్యభామినుల్**
**కాంతు డవజ్ఞ సేసినను గాయము వాయుదు; రేనమర్త్యనై**
**చింతల వంతలం జివికి సిగ్గఱితిన్; మృతి లేనినాదు చె**
**ల్వింతయు శూన్యగేహమున కెత్తిన దీపిక యయ్యె నక్కటా!**

**- మనుచరిత్ర. తృతీయాశ్వాసము. పద్యం. 8**

పై పద్యం సాహితీసమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయల చేత ‘‘ఆంధ్రకవితాపితామహా!’’ అని పిలిపించుకున్న అల్లసాని పెద్దన వ్రాసిన మనుచరిత్రలోనిది. తెలుగు పంచకావ్యాల జాబితాలో మనుచరిత్ర ఎప్పుడూ మొదటిదిగా చెప్పబడుతుంది.

‘‘తక్కిన వారికంటే కాస్త మించి ఉన్నాడు’’ అని ఎవరి గురించి అయినా చెప్పేటప్పుడు ‘‘వాళ్ళకంటే వీడు నాలుగాకులు ఎక్కువ చదివాడు’’ అనడం లోకసాధారణం. మరి సకలపురాణేతిహాసాలతో బాటు, తనకు పూర్వం ఉన్న కవిత్రయాది కవులందరినీ క్షుణ్ణంగా చదువుకుని, భావికవులకు ప్రబంధమార్గాన్ని ఏర్పరచిన పెద్దన ‘‘నాలుగాకులేవిటి పదాకులు ఎక్కువ చదివేడు’’ అన్నా- అది అతిశయోక్తి కాదు. ఆరుద్రగారు కూడా పెద్దన గురించి ‘‘ఆయనలో పూర్వకవుల శుభలక్షణాలన్నీ ఒక్కరూపున మూర్తీభవించి సాక్షాత్కరిస్తాయి’’ అన్నారు.

ఇప్పుడు పైన చెప్పిన పద్యానికి పూర్వరంగం ఏవిటో చూద్దాం. పూర్వరంగం అంటే గుర్తొచ్చింది. మనుచరిత్రలో మనువైన ‘‘స్వారోచిషు’’ని గురించి చెప్పేవి కావ్యం చివరిలో ఉన్న 21 పద్యాలు మాత్రమే. దీనికి ముందు చెప్పబడిన కథ అంతటిలో ఈ మనువు జన్మకు దారితీసిన సంఘటనలు మాత్రమే ఉన్నాయి. ఇలా చివర ఉన్న వృత్తాంతానికి తక్కిన గ్రంథం అంతా పూర్వరంగమే అవుతుంది. ‘‘మనుచరిత్ర’’ అన్నది లోకప్రసిద్ధమైన నామం అయినా ‘‘స్వారోచిషమనుసంభవం’’ అన్నదే దీనికి తగిన పేరు.

మనుచరిత్ర కథ యావత్తు తెలిసినా తెలియకపోయినా, వరూధినీ ప్రవరాఖ్యుల కథ తెలియని తెలుగువాడుండడు. ఆంధ్రదేశంలో ‘‘అపర ప్రవరాఖ్యుడు’’ అన్నది నలుగురి నోటా నానే నానుడి అయికూర్చుంది. సిద్ధుడు పూసిన పసరు మహత్తు వల్ల, హిమగిరిని చేరుకున్నాడు... మకరాంక శశాంకమనోజ్ఞమూర్తి(చందమామలాంటి రూపంకలవాడు), అలేఖ్యతనూవిలాసుడైన(చిత్రంలో

ఒదగని అందమైన శరీరం కలవాడు) ప్రవరాఖ్యుడు. అందంలో జయంత,వసంత,కంతులని జయింపజాలిన రూపురేఖావిలాసాలుగల ఆ భూసురుణ్ణి చూసి వలచి వెంట పడింది వరూధిని. ఈ ప్రవర్తన ఏదో కూడని పనిలాగ కనబడి, వరూధిని పట్ల కాస్త చులకన భావం కలుగుతుంది. కాని పరిశీలించి చూస్తే అది నిజంకాదు అని అర్దం అయిపోతుంది. తనకు నచ్చిన మనిషో, వస్తువో, సంపదో, సుఖమో కావాలని వాంఛించడం అన్నది మానవలక్షణమే కాదు, దేవుడు సృష్టించిన ప్రతిజాతిలోనూ ఉంది. ఆఖరికి ఆ దేవతలలో కూడాను. వరూధిని ప్రవర్తన ఇందుకు భిన్నంగా ఏమాత్రం లేదు. సాధారణంగా తమను ఆకట్టుకున్న దాని మీద మోజుపడి, మోహపడేవారు, వాళ్ళ శక్తి సామర్ధ్యాలని గణించకుండానే ఆ కోరికని పెంచుకుంటారు. ఇది మానవసహజం.

మరి ఇక్కడ వరూధిని సామాన్యస్త్రీ కూడా కాదు. గంధర్వకాంత. యక్షులు, గంధర్వులు దేవతామహిమలు,శక్తులు కలవాళ్ళు. విమలగాంధర్వవిద్యా పారీణురాలు,విద్యుల్లతావిగ్రహ,శతపత్రేక్షణ, చంచరీకచికుర,చంద్రాస్య అయిన ఈ వరూధిని దేవకాంతలలో శిరోమణి లాంటిది. సాధారణ వ్యక్తే తనకిష్టమైన దానిని కోరుకోగాలేంది, వరూధిని లాంటి మరున్నారీశిరోమణి అందచందాలలో తనకు సమఉజ్జీగా కనబడిన ప్రవరుణ్ణి కోరుకోడంలో అసమంజసం ఏముంది?

ప్రవరుని కోరి ఆమె చేసిన ప్రయత్నం ఫలించలేదు. వరూధినిని కాదని త్రోసిపుచ్చిన ప్రవరుడు, అగ్నిదేవుని సహాయంతో ఇల్లు చేరుకున్నాడు. ప్రవరుడి మీద మనసు లగ్నం అయిన వరూధిని విరహవేదనకి గురైంది. దుఃఖసాగరంలో మునిగిపోయింది. తాను కొఱగాని నోములు నోచుకున్నానన్నది. ప్రవరుడి సౌందర్యాతిశయాన్ని మరోసారి తలుచుకుంది. చంద్రుడిని,మలయానిలయాన్ని నిందించే దాకా రాలేదు. ముందుగా తన అసమర్ధతను తానే నిందించుకుంటూ ఈ విధంగా పరితపిస్తుంది.

‘‘భూలోకవాసులైన స్త్రీలు ఎంత తపస్సు చేసుకుని పుట్టారో కదా! మానవ స్త్రీలు భర్త లేదా ప్రియుడు అవజ్ఞ చేసిన అంటే తిరస్కరించితే, తమ శరీరాన్ని వదలి ప్రాణత్యాగం చేసుకుంటారు. మరి గంధర్వ స్త్రీనైన నేను అశక్తురాలినై , బాధతో దుఖః పడుతూ, చివికి పోతూ, సిగ్గు విడిచిన దాన్నయ్యాను. చావులేనిది నా శరీరం. దీని సౌందర్యం అంతా శూన్యగృహాన్ని చూపించటానికి పట్టుకున్న దీపం లావుంది కదా!" అని వాపోతోంది గంధర్వకాంత,వరూధిని. మానవకాంతలు ఎంతో తపస్సు చేసి పుట్టి ఉంటారు - అనడంలో ...

తపస్సుకు ఫలం పుణ్యమే కాదు. తపోశక్తి. దాని ద్వారా తమకు కావలసినది చెయ్యగలిగే శక్తి సామర్ధ్యాలు కలిగి ఉండడం. వరూధినికి తాను గంధర్వజాతిలో పుట్టటం అన్నది వరంకాదు. దాని వలన తనకు అబ్బిన అదృష్టం అంటూ ఏమీ లేదు. తాను దేవతాశక్తితో సాధించలేనిది మానవస్త్రీలు అతిసులువుగా చెయ్యగలుగుతున్నారు.

‘‘ మృతిలేని నాదు చెల్వింతయు శూన్యగేహమున కెత్తిన దీపిక యయ్యె ’’ తన కున్న అపూర్వ సౌందర్యమంతా ఎంత వ్యర్ధమయినదో చెప్పడానికి ఉపయోగించిన సామ్యం దీపిక. దీపం కాంతివంతమైనది. దాని వెలుగుతో తాను తాకిన వస్తువులని

బాగా కనబడేటట్టు చెయ్యడం దాని గుణం. ఇక్కడ ప్రకాశించవలసింది. తన భాగ్యం, అదృష్టం. ప్రవరుని సాంగత్యాన్ని పొందని తాను శూన్యగృహం వంటిది. తన శరీరం ఎంత సౌందర్యాతిశయం గల దైతేనేమి. అది రిక్తము, వ్యర్థము అయినదే అవుతుంది కదా.

వరూధిని సౌందర్యానికి దీపత్వాన్ని ఆరోపించటంలో మరోసారి ఆమె సౌందర్యాతిశయానికి హారతులెత్తటము, తనను మర్త్య భామినులతో పోల్చుకుని తనకంటే వారే అదృష్టవంతులనడంలో ఆమె నిస్సహాయత, నిరాశలను తెరతీసి చూపించడం జరిగింది. పెద్దనగారి కవితాచాతుర్యానికి ఇదొక మచ్చుతునక. అల్లసాని పెద్దన ఉయ్యాలమంచంమీద ఊగుతూ వ్రాశారో, ఊగకనే వ్రాశారో తెలియదు గాని, మనుచరిత్రలో ఆయన కవితాశైలికి ఊగని,తూగని పాఠకుడు అంటూ ఉండడు.